ప్రజాశక్తి
గురువారం 30 మే 2024 8 పేజీలు
గుంటూరు పల్నాడు





నిర్మాణాలపై నియంత్రణ లేమి

- రేరా నిబంధనలను పట్టించుకోని బిల్డర్లు
- మున్సిపల్ అధికారుల అవినీతితో యథేచ్ఛగా అక్రమ రిజిస్ట్రేషన్లు



ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (రేరా) పరిధిలో నిర్మాణాలు చేపట్టడానికి బిల్డర్లు ఆసక్తి చూపడం లేదు. రాష్ట్రం మొత్తం మీద 1500 మందికి పైగా పెద్ద బిల్డర్లు ఉండగా దాదాపు 500 మంది మాత్రమే ఈ అథారిటీ పరిధిలో తమ సంస్థల పేర్లను నమోదు చేసుకున్నారు. 600 గజాల స్థలం కంటే మించిన స్థలంలో అపార్టుమెంట్లు నిర్మించినా గరిష్టంగా ఎనిమిది ప్లాట్లుకు మించి నిర్మించినా ఈ అథారిటీకి ఫీజు చెల్లించాలి. భూమి అభివృద్ధి కింద చేపట్టే నిర్మాణాలకు సంబంధించి భూమి యజమానికి, బిల్డరుకు మధ్య జరిగే ఒప్పందాలకు రేరా ద్వారా అనుమతి పొందాలి. కానీ చాలామంది నిబంధనలను పట్టించుకోవడం లేదు. ప్రతి నిర్మాణానికి సంబంధించిన సంబంధిత మునిసిపాలిటీ, పంచాయతీలు ఇచ్చే ప్లాన్‌లను రేరాలో పొందుపర్చిన తరువాతే నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. తద్వారా అపార్టుమెంట్లు పాట్లు కొనుగోలు చేసే వారు. అభివృద్ధి కింద ప్లాట్లు తీసుకునే వారు బిల్డర్ల నుంచి ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా రేరా బాధ్యత తీసుకుంటుంది. ఒప్పందాలను ఉల్లఘిస్తే వెంటనే సంబంధిత బిల్డర్లును బ్లాక్ లిస్టులో పెట్టాలని రేరా ఆయా స్థానిక సంస్థలకు సిఫార్సులు చేస్తుంది. దీంతో చాలామంది బిల్డర్లు రేరా వద్ద తమ ప్లాన్లు దాఖలు చేసేందుకు ముందుకు రావడంలేదు.

అక్రమ నిర్మాణాలు, బహుళ అంతస్తుల సముదాయాలు యథేచ్ఛగా నిర్మిస్తున్నా నియంత్రణ అథారిటీ అధికారులు పట్టించుకోవడం లేదు. నగరపాలక సంస్థ నుంచి ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ లేకుండా 18 అంతస్తుల సముదాయాల్లో ప్లాట్లను విక్రయించేస్తున్నారు. అక్రమ రిజిస్ట్రేషన్లు జరుగుతున్నా పట్టించుకోవడం లేదు. నిర్మాణాలు పూర్తి చేయకుండానే సంబంధిత బిల్డర్లు అపార్టుమెంట్లు నిర్మించినట్లు వేరే చోట నిర్మాణంలో ఉన్న ఫొటోలను చూపించి అక్రమ రిజిస్ట్రేషన్‌లు చేస్తున్నారు. ఒప్పందం ప్రకారం కొన్ని ▶ 2లో



నిరసన తెలుపుతున్న కార్మికులు

9న కెసిపి ఫ్యాక్టరీ భూముల్లోకి కార్మికులు

ప్రజాశక్తి-తాడేపల్లి



కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

న్యాయం మన వైపు ఉంది.. ఎటువంటి జంకూ లేకుండా జూన్ 9వ తేదీ కెసిసి సిమెంటు ఫ్యాక్టరీ భూముల్లోకి వెళ్దాం.. భూమి స్వాధీనం చేసుకుని గుడిసెలు నిర్మించుకోవడానికి సిద్ధం కండి.. అని సిమెంటు ఫ్యాక్టరీ కార్మికులకు ఆఖిలపక్ష ట్రేడ్ యూనియన్లు పిలుపునిచ్చాయి. ఫ్యాక్టరీ ఆవరణలోని యూనియన్ కార్యాలయం వద్ద ఖాళీ ప్లేట్లు పట్టుకుని ఆకలికేకలతో స్థానిక అంబేద్కర్ విగ్రహం ముందు కార్మికులు బుధవారం నిరసన తెలిపారు. అనంతరం జరిగిన సభకు యూనియన్ కార్యదర్శి కూరపాటి స్టీవెన్ అధ్యక్షత వహించారు. సిపిఎం సీనియర్ నాయకులు జొన్నా శివశంకరరావు మాట్లాడుతూ 31 ఏళ్లపాటు సిమెంటు ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న సుదీర్ఘ పోరాటాన్ని వివరించారు. అయినా కార్మికుల సమస్యను పాలకవర్గ పార్టీలు పరిష్కరించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వివిధ రకాల నిరసనల ద్వారా ఏ ప్రభుత్వం అధికారంలో ఉంటే ఆ ప్రభుత్వానికి రాయభారాలు, వినతులు అందించినా స్పందించకపోవడం బాధాకరమన్నారు. సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వి.దుర్గారావు మాట్లాడుతూ సిమెంటు ఫ్యాక్టరీ కార్మికుల పోరాటం అమితుమీ తేల్చుకునే దశకు వచ్చిందన్నారు. కార్మికులకు అనుకూలంగా కోర్టులు తీర్పులిచ్చినా ఇంత వరకు న్యాయం దక్కలేదన్నారు. ఫ్యాక్టరీ భూమి అమ్మి కార్మికులకు నష్టపరిహారం చెల్లించాలని న్యాయస్థానాలు చెప్పిన తరువాతా యాజమాన్యం ఆ పని చేయనప్పుడు భూముల్లోకి వెళ్లడం తప్ప మరోమార్గం లేదన్నారు. ఫ్యాక్టరీ యాజమాన్యంతో తాడోపేడో తేల్చుకోవడానికి కార్మిక కుటుంబాలు పిల్లపాపలతో ▶ 2లో

గడ్డివామిలో పెట్రోల్ బాంబులు





ప్రజాశక్తి - బెల్లంకొండ

మద్యం సీసాల్లో పెట్రోల్ పోసి వాటికి ఒత్తులు ఏర్పాటు చేసిన నాలుగు సీసాలను మండలంలోని నాగిరెడ్డిపాలెంలో పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ రాజేష్ వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గంగిరెడ్డి రామిరెడ్డి తనకున్న 80 సెంట్లకు చెందిన వరిగడ్డివామిని మండల కేంద్రమైన క్రోసూరుకు చెందిన వారికి విక్రయించారు. ఆ గడ్డిని వారు ట్రక్కులో వేసుకునే సందర్భంలో సీసాలను కూలీలు గమనించ డంతో విషయం వెలుగులోకి వచ్చింది. వీటిని స్వాధీనం చేసుకుని విచారణ చేపట్టామని ఎస్ఐ తెలిపారు.

ధరల సెగలు

పరిమితంగా కొంటున్న మధ్యతరగతి

జంకుతున్న సామాన్యులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



ఒకవైపు అధిక ఉష్ణోగ్రతలతో ఉక్కపోతో అల్లాడుతున్న జనం మరోవైపు కూరగాయలు ధరలతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఈ ధరలేమిటి... అంటూ నిట్టూరుస్తూ పరిమితంగానే మధ్య తరగతి ప్రజలు కొనుగోలు చేస్తున్నా పేదలు మాత్రం ఇంత పెట్టి కొనలేములే.. అంటూ పక్కకెళ్తున్నారు. స్థానిక మార్కెట్‌లో ఓ మహిళ రూ.10 పచ్చిమిర్చి తీసుకోగా 10 కాయలు మాత్రమే రావడంతో 'ఇదేంది.. ఒక్కో కాయ రూపాయా?' అంటూ అవాక్కయ్యారు.

మార్కెట్‌లో కూరగాలయ ధరలు ఎండలకు పోటీగా సెగలు పుట్టిస్తున్నాయి. రోజువారీ కూలిపనులు చేసుకునే వారు కూరగాయల కొనాలంటేనే జంకుతున్నారు. గత వారం రూ.20-30 మధ్య ఉన్న కొన్ని రకాల కూరగాయల ధరలు ఇప్పుడు రూ.50-100 వరకూ పెరిగాయి. బుధవారం టమాటా కిలో రూ.60, పచ్చి మిర్చి రూ.120, బీరకాయలు రూ.120, క్యాలీఫ్లవర్ రూ.100, క్యాబేజీ రూ.80, బెండ రూ.60, వంకాయ రూ.60, దొండ 50 వరకు ధరలు పేలుతున్నాయి. 10 రోజుల క్రితం కిలో టమాటా రూ.30 ఉండగా ఇప్పుడు రెండింతలైంది. ఎండ తీవ్రత వల్ల టమాటా, ఇతర కూరగాయలు దిగుబడి తగ్గిందని, అందుకే ధరలు పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు. ప్రధానంగా చిత్తూరు జిల్లా మదనపల్లి నుండి అధికంగా టమాటా దిగుమతులుండేవని, ఇప్పుడు అక్కడి నుండి కూడా సరఫరా కావడం లేదని అంటున్నారు. పైగా టమాటా ధర రూ.100కు పెరిగానా పెరగొచ్చనీ వ్యాపారులు అంచనా వేస్తున్నారు.

ఇసుకను అక్రమంగా తవ్వితే చర్యలు

పలు రీచ్‌లలో గుంటూరు జిల్లా కలెక్టర్ పరిశీలన

ప్రజాశక్తి-గుంటూరు

నేషనల్ గ్రీన్ ట్రిబ్యూనల్ నిబంధనలకు విరుద్ధంగా జిల్లాలో ఇసుక తవ్వకాలు జరగకుండా మైనింగ్, రెవెన్యూ, పోలీస్, సంబంధిత శాఖల అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు పకడ్బందీగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి ఆదేశించారు. జిల్లా ఎస్పీ తుషార్ దూడీ, జిల్లా సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి, తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖర్‌జైన్, జిల్లా స్థాయి ఇసుక కమిటీ సభ్యులతో కలసి తాడేపల్లి, కొల్లిపర మండలాల్లోని ఇసుక రీచ్‌లను కలెక్టర్ బుధవారం తనిఖీ చేశారు. మొదటగా కొల్లిపర ▶ 2లో



ఇసుక రీచ్‌ల వద్ద సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

పేద కుటుంబంలో పెను విషాదం

- హైదరాబాద్ రోడ్డు ప్రమాదంలో మరో కుమారుడూ మృతి
- ఇద్దరు బిడ్డల మరణంతో శోకసంద్రంలో తల్లిదండ్రులు

2 లో





మృత సోదరులు హుస్సేన్ భేగ్, ఇస్మాయిల్ భేగ్ (ఫైల్)



2 లో

నంబూరు వద్ద పంటకాల్వను పరిశీలిస్తున్న పాశం రామారావు తదితరులు

పంట కాల్వల్లో పూడికతీత పనులు చేపట్టాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు



గుంటూరులో వాహనాలను స్వాధీనం చేసుకున్న అధికారులు

కొనసాగుతున్న కార్డన్ సెర్చ్

ఆధారాల్లేని వాహనాల స్వాధీనం

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

ఓట్ల లెక్కింపు నేపథ్యంలో పలుచోట్ల కార్డన్ సర్చ్ ఆపరేషన్ కొనసాగుతోంది. బుధవారం వివిధ ప్రాంతాల్లో అధికారులు పోలీసు కవాతుతోపాటు తనిఖీలు చేపట్టారు. కార్డెన్ సెర్చ్‌లో భాగంగా సరైన ధ్రుపత్రాల్లేని వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. గుంటూరు జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్, 30 పోలీసు చట్టం అమలులో ఉన్న కారణంగా ప్రజలు గుంపులు గుంపులుగా వుండరాదని, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించాలని ఎస్‌పి తుషార్ దూడి కోరారు. సామాన్య ప్రజల్లో ధైర్యం నింపుతూ పోలీసు వ్యవస్థ పట్ల విశ్వాసం పెంచడానికి, పరారీలో ఉన్న నేరస్తులను గుర్తించి అదుపులోకి తీసుకోవడం, చోరీసొత్తు, అనుమానంగా ఉన్న రికార్డులు లేని అన్నీ వస్తువులు, వాహనాలు, అక్రమ మద్యం, ఆయుధాలు, పేలుడు పదార్థాలు, మాదక ద్రవ్యాలు వాటివి గుర్తించి స్వాధీన పరుచుకోవడం తదితర చర్యలు చేపట్టాలని పోలీసులను ఆదేశించారు. ప్రత్యేక కార్యాచరణ ద్వారా జిల్లాలో హింసాత్మక చర్యలు అరికట్టేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో ప్రతి ఇంటినీ క్షుణ్ణంగా పరిశీలించి, అనుమానితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని చెప్పారు.



26 వాహనాలు స్వాధీనం

ప్రజాశక్తి - మంగళగిరి

పట్టణ, రూరల్ సిఐలు శ్రీనివాసరావు, వెంకట్రావుల ఆధ్వర్యంలో ముగ్గురు ఎస్ఐలతో పాటు 40 మంది సిబ్బందితో టిడ్కో గృహాల వద్ద కార్డెన్‌సెర్చ్ చేపట్టారు. ధ్రువపత్రాలు లేని 26 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అనుమానితులపై నిరంతరం నిఘా ఉంటుందని, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టామని పోలీసులు చెప్పారు.



పట్టుబడిన నాటు సారాయి

ప్రజాశక్తి - మాచర్ల

పట్టణంలోని 22వ వార్డులో బుధవారం జరిగిన కార్డెన్ సెర్చ్‌లో ప్రతి ఇల్లు, ఖాళీ స్థలాలనూ పోలీసులు అణువణువూ గాలించారు. ఖాళీ స్థలాల దిబ్బల్లో దాచిన నాటు సారాయి నిల్వ చేసిన క్యాన్స్‌ను పోలీసులు గుర్తించారు. ఆ ప్రాంతంలో నాటు సారా అమ్మేవారు ఉండటం, వారు ఖాళీ స్థలాల్లో, మరుగు ఉన్న ప్రదేశాలలో నాటు సారా దాచి ఉంచుతారనే సమాచారంతో ఆ ప్రాంతమంతా జల్లెడ పట్టారు. దొరికిన నాటుసారా ఎవరికి చెందినదో విచారణ చేసి కేసులు నమోదు చేయిస్తామని పట్టణ ఎస్ఐ బి.గోపాల్ చెప్పారు.

పేద కుటుంబంలో పెను విషాదం

- హైదరాబాద్ రోడ్డు ప్రమాదంలో మరో కుమారుడూ మృతి
- ఇద్దరు బిడ్డల మరణంతో శోకసంద్రంలో తల్లిదండ్రులు

ప్రజాశక్తి-తెనాలి

వారిది పేద కుటుంబం.. సాదా సీదాగా జీవనం సాగిస్తున్న ఆ దంపతులకు ఇద్దరు కుమారులు కాగా వారిని తమ స్తోమత కొద్దీ చదివించారు. ఆ చదువుతోనే తల్లిదండ్రులకు సాయమందించేందుకు ఉపాధి కోసం హైదరాబాద్ వెళ్లిన అన్న దమ్ములను రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు కబళించింది. అన్న ప్రమాద స్థలంలోనే మృతి చెందిన సంగతి తెలిసిందే. కాగా తమ్ముడు మృత్యువుతో పోరాడి బుధవారం తుదిశ్వాస విడిచాడు. ప్రమాదంలో రెండో బిడ్డయినా ప్రాణాలతో బైటపడాలని ఆవేదనతో ఎదురు చూసిన తల్లిదండ్రులకు కడుపు కోతే మిగిలింది. బిడ్డల భవిష్యత్‌పై గంపెడాసెలు పెట్టుకున్న వారి రోదన అడవి కాచిన వెన్నెలే అయ్యింది.

పట్టణంలోని గాంధీనగర్ లెనిన్ రోడ్డులో నివాసం ఉండే మహ్మద్ ఖలీల్ భేగ్, ఆషాభేగం దంపతులకు మహ్మద్ హుస్సేన్ భేగ్ (22), ఇస్మాయిల్ భేగ్ (19) ఇరువురు కుమారులు. ఖలీల్ భేగ్ పట్టణంలోని ఓ వస్త్ర దుకాణంలో గుమాస్తాగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించు కుంటుండగా ఆషా భేగం గృహిణి. డిగ్రీ వరకూ చదువుకున్న హుస్సేన్‌భేగ్, ఐటిఐ మెకానికల్ డిప్లమో పూర్తి చేసిన ఇస్మాయిల్ భేగ్ హైదరాబాద్ వెళ్లారు. అక్కడ హుస్సేన్‌భేగ్ చిరుద్యోగం చేస్తుండగా, ఇస్మాయిల్ భేగ్ హెచ్ఎఎల్‌లో అప్రెంటీస్ చేస్తున్నాడు. తెనాలి ప్రాంతానికే చెందిన కార్తీక్‌తో ఎల్బీ నగర్ సమీపంలోని ఆదిభట్ల ప్రాంతంలో ఓ గదిలో అద్దెకుంటున్నారు. ఈనెల 27న ఉదయం ముగ్గురూ బైక్‌పై బయలుదేరారు. ఇస్మాయిల్ భేగ్‌ను హెచ్ఏఎల్‌లో దింపి, మిగిలిన ఇద్దరూ ఎవరి పనులకు వాళ్లు వెళ్లాల్సి ఉంది. ఈ క్రమంలో మీర్‌పేట వద్ద బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనటంతో కార్తీక్‌కు స్వల్ప గాయాలు కాగా, హుస్సేన్ భేగ్ ఘటనా స్థలంలోనే ప్రాణాలో కోల్పోవటం, ఇస్మాయిల్ భేగ్‌కు తీవ్ర గాయాలు కావటంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలిచంటం తెలిసిందే. విషయం తెలుసుకున్న తండ్రి ఖలీల్ భేగ్ హుటాహుటిన హైదరాబాద్ వెళ్లి హుస్సేన్ భేగ్ మృతదేహాన్ని తెనాలి తరలించి మంగళవారం అంత్యక్రియలు ముగించారు. రెండో కుమారుడైనా ప్రాణాలతో బైట పడతాడని తల్లిదండ్రులు ఆశించారు. అయితే ఇస్మాయిల్ భేగ్ బుధవారం ఉదయం మృతి చెందాడు. పిల్లలపై గంపెడాసెలతో బతుకుతున్న తల్లిదండ్రులను వారి మరణ వార్త తీవ్రంగా కలిచివేసింది. తామెవరి కోసం బతకాలంటూ ఆ దంపతులు దుఃఖ:సాగరంలో మునిగిపోయారు. కుటుంబ సభ్యులు, బంధు మిత్రుల రోధనలు మిన్నంటాయి. ఇస్మాయిల్ భేగ్ మృతదేహం ఆర్ధరాత్రికి తెనాలి చేరే అవకాశం ఉందని, అంత్యక్రియలకు ఏర్పాట్లు జరుగుతున్నట్లు కుటుంసభ్యులు తెలిపారు.



హైదరాబాద్ ఆసుపత్రి వద్ద ఇస్మాయిల్ మృతదేహం

పంట కాల్వల్లో పూడికతీత పనులు చేపట్టాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు

ప్రజాశక్తి-గుంటూరు

వ్యవసాయ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో పంట కాల్వల్లో పేరుకుపోయిన తూటు కాడ, గుర్రపు డెక్క, ఇతర పూడికలను యుద్ధప్రాతిపదికన తొలగించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు డిమాండ్ చేశారు. పెదకాకాని మండలం నంబూరులో కాల్వలను సిపిఎం నాయకులు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ కాల్వల్లో గుర్రపు డెక్క, తూటుకాడ వల్ల నీటిపారుదల సరిగా ఉండడం లేదని, చిన్న వర్షం వచ్చినా కాల్వలు పొంగుతున్నాయని చెప్పారు. గుంటూరు ఛానల్, కొండవీడు వాగు ఇతర పంట కాల్వలన్నింటిలోనూ పూడిక తీయాలని కోరారు. పెదవడ్లపూడి హై లెవెల్ ఛానల్ దానికి అనుబంధంగా ఉన్న కాల్వల్లో తూటు కాడ, గుర్రపు డెక్క పేరుకుపోయి నీరు కలుషితమవుతున్నాయని చెప్పారు.

అనేక గ్రామాల్లో ఈ కాల్వల ద్వారా వచ్చే నీటిని ఫిల్టర్ చేసి తాగునీటిగా అందిస్తుండగా అవి దుర్వాసన వస్తున్నాయని తెలిపారు. పెదవడ్లపూడి హై లెవెల్ ఛానల్ పనులు పూర్తి చేయాలని, గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగించేందుకు గతంలో ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను అనుగుణంగా నిధులు విడుదల చేసి పనులు ప్రారంభించాలని కోరారు. పరిశీలనలో సిపిఎం పెదకాకాని మండల కార్యదర్శి ఎన్.శివాజీ, నాయకులు ఎం.శ్రీనివాసరావు, వెంకటరెడ్డి, రాజారమేష్, సింహాద్రి పాల్గొన్నారు.

సాంకేతిక లోపంతో నిలిచిన డెల్టా ఎక్స్‌ప్రెస్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

సికింద్రాబాద్ నుంచి రేపల్లే వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ ట్రైన్ బుధవారం రాత్రి గుంటూరు-వేజెండ్ల మధ్య సాంకేతిక లోపంతో విద్యుత్ సరఫరా లేక రైలు తక్కెళ్లపాడు వద్ద నిలిచి పోయింది. అధికారులు జోక్యం చేసుకుని లోపాన్ని సవరించ డంతో గంటన్నర ఆలస్యంగా రైలు రేపల్లేకు బయలు దేరింది. ఇదే రైలు రేపల్లే వెళ్లి తిరిగి డెల్టా ఎక్స్‌ప్రెస్‌గా సికింద్రాబాద్ వెళ్లాల్సి ఉంది. సాంకేతిక లోపంతో దాదాపు గంటన్నర ఆలస్యంగా రైలు నడిచింది.

పాలీసెట్ కౌన్సెలింగ్‌కు 221 మంది హాజరు

ప్రజాశక్తి-గుంటూరు

పాలిటెక్నిక్ కాలేజిల్లో ప్రవేశానికి నిర్వహిస్తున్న పాలీసెట్ కౌన్సెలింగ్ కొనసాగుతుంది. నల్లపాడులోని ఎంబిటిఎస్ పాలిటెక్నిక్ కాలేజిలో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ సెంటర్‌లో బుధవారం మూడవ రోజు 27001 నుండి 43000 ర్యాంకు వరకూ ధృవపత్రాలు పరిశీలన చేయగా 221 మంది విద్యా ర్థులు హాజరయ్యారు. గురువారం 43001 నుండి 59000 ర్యాంకు వరకూ కౌన్సెలింగ్ నిర్వహిస్తారు.

రోడ్డు ప్రమాద బాధితులకు పరామర్శ

ప్రజాశక్తి-తెనాలి

నియోజకవర్గంలోని కొల్లిపర మండలం దావులూరి పాలెం చెందిన దాదాపు 20 మంది రోడ్డు ప్రమాదంలో గాయపడి తెనాలి జిల్లా వైద్యశాలలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో వారిని మాజీ స్పీకర్, సాధారణ ఎన్నికలలో కూటమి అభ్యర్థిగా పోటీచేసిన నాదెండ్ల మనోహర్ పరామర్శించారు.

ఇసుకను అక్రమంగా తవ్వితే చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

మండలంలోని బొమ్మువానిపాలెం 14, 15 ఇసుక రీచ్‌లను, అనంతరం మున్నంగిలోని ఇసుక రీచ్‌ను, తాడేపల్లి మండలంలోని గుండిమెడ ఇసుక రీచ్‌లను పరిశీలించారు. రీచ్‌ల వద్ద 24 గంటలు పర్యవేక్షించేందుకు రెండు షిఫ్ట్‌లుగా నియమించిన బృందాల్లోని సిబ్బందితో జిల్లా కలెక్టర్ మాట్లాడారు. ఎట్టి పరిస్థితులోను ఇసుక అక్రమ రవాణా జరగకుండా పర్యవేక్షించాలన్నారు. ఎన్జీటీ నిబంధనలకు విరుద్ధంగా యంత్రాలతో రీచ్‌లలో త్రవ్వకాలు జరగకుండా అనుమతులు పొందిన పరిధిలోనే మాన్యువల్‌గా ఇసుక తవ్వకాలు జరిగేలా మైనింగ్ శాఖ అధికారులతో పాటు పోలీస్, రెవెన్యూ, శాండ్ కమిటీలోని ఇతర శాఖల అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరుగుతున్నట్లు గుర్తిస్తే వెంటనే పోలీస్ శాఖ అధికారులు కేసులు నమోదు చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన కమిటీ అయినందున కమిటీలోని సభ్యులందరూ అత్యంత ప్రాధాన్యమిచ్చి జిల్లాలో ఎన్‌జిటి తీర్పునకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు జరగకుండా నిరంతరం పర్యవేక్షించాలన్నారు. అక్రమంగా ఇసుక తవ్వకాలపై వచ్చే ఫిర్యాదులపై కమిటీ సభ్యులందరూ క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి నిర్దేశించిన ఫార్మేట్‌లో నివేదిక ఇవ్వాలన్నారు. అనుమతి పొందిన ఇసుక రీచ్‌లతో పాటు ఇతర ప్రాంతాల్లోనూ నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు జరగకుండా పోలీసు, రెవెన్యూ, మైనింగ్, రవాణా, ఇతర శాఖల అధికారులు నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించాలని చెప్పారు. తనిఖీల్లో గుంటూరు రెవెన్యూ డివిజన్ అధికారి శ్రీకర్, జిల్లా స్థాయి ఇసుక కమిటీ కన్వీనర్ మైనింగ్ శాఖ డీడీ చంద్రశేఖర్, జిల్లా ఎస్ఈబి అదనపు సూపరింటెండెంట్ ఎం.వెంకటేశ్వర్లు, జిల్లా పంచాయతీ అధికారి శ్రీదేవి, భూగర్భ జలవనరుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ వందనం, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీరు నారాయణ, జిల్లా ఉప రవాణా కమిషనర్ కరీం, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ కళ్యాణ చక్రవర్తి పాల్గొన్నారు.

వివాదాలకు పాల్పడితే కఠిన చర్యలు

అదనపు ఎస్పీ వై.సురేష్ బాబు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



మాట్లాడుతున్న అదనపు ఎస్పీ వై.సురేష్ బాబు

పల్నాడు జిల్లాలో ఓట్ల లెక్కింపు అనంతరం అల్లర్లు జరిగే అవకాశం ఉందన్న ఇం టెలిజెన్స్ హెచ్చరికలతో గుంటూరు రేంజి ఐజి సర్వశ్రేష్టి త్రిపాఠి, పల్నాడు ఎస్పీ మల్లిక గార్గ్ ఆదేశాల మేరకు బుధ వారం నరసరావుపేట పట్టణంలోని ఎస్.ఎస్.ఎన్ కళాశాల వద్ద నుండి మల్లమ్మ సెంటర్ వరకు పోలీసు బలగాలు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ వై.సురేష్ బాబు మాట్లా డుతూ ఎన్నికల కౌంటింగ్ సంద ర్భంగా వివాదాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలింగ్ రోజున పల్నాడులో వాటిల్లిన వివాదాల నేపథ్యంలో జిల్లాలో పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డిఎస్పీ ఎం.సుధాకర్ పాల్గొన్నారు.

9న కెసిపి ఫ్యాక్టరీ భూముల్లోకి కార్మికులు

(మొదటి పేజీ తరువాయి)

కలిసి కదలిరావాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు డి.సామ్యేలు, ఎఐటియుసి నాయకులు టి.వెంకటయ్య, ఐఎఫ్‌టియు నాయకులు కె.ఆదినారాయణ, యూనియన్ కార్యదర్శి కె.స్టీవెన్ మాట్లాడుతూ ఉద్యమంతో ముందుకు సాగి విజయం సాధించాలని పిలుపునిచ్చారు. కార్మికుల పోరాటానికి తమ పూర్తి అండదండలు ఉంటాయని హామీనిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం రూరల్, పట్టణ కార్యదర్శులు డి.వెంకటరెడ్డి, బి.వెంకటేశ్వర్లు, బిఎస్‌పి నాయకులు జయరాజు, కార్మికులు యెహోషువా, సూర్యప్రకాష్, నవనీతం, సాంబశివరావు, సుబ్బారావు, ఎస్‌కె ఆసిఫ్, శారద, ఇమామ్‌బి, శారమ్మ, నాగేశ్వరరావు, అంకయ్య, ఇస్రాయిల్ పాల్గొన్నారు.

నిర్మాణాలపై నియంత్రణ లేమి

(మొదటి పేజీ తరువాయి)

కంపెనీలకు చెందిన మెటీరియల్ వాడతామని చెప్పి ఆ తరువాత నాణ్యత లేని మెటీరియల్ వాడుతున్నారని భూయజమానులకు బిల్డర్లుకు మధ్య వివాదాలు వస్తున్నాయి. ఆర్థిక స్థోమత లేకున్నా కొంత మంది బిల్డర్లు స్థల యజమానులతో ఒప్పందం చేసుకుని నిర్ణీత గడువులోగా నిర్మాణాలు పూర్తి చేయడం లేదని తరచూ పోలీసు అధికారులకు ఫిర్యాదుల అందడటం, వారు ఇది సివిల్ మేటర్ మాకు సంబంధం లేదని చెప్పడంతో ఏమీ చేయలేక కోర్టులను ఆశ్రయిస్తున్నారు. నిర్మాణాల్లో నిబంధనలు పాటించని వారు మాత్రమే రేరా పరిధిలో పనిచేయడానికి సుముఖత చూపడంలేదని రేరా ప్రతినిధులు చెబుతున్నారు. సంబంధిత బిల్డర్లుకు నోటీసులు ఇచ్చి అందరినీ రేరా పరిధిలోకి తేవడానికి కృషి చేస్తున్నామని చెబుతున్నా ఆచరణలో సాధ్యం కావడం లేదు.

రైలు ఢీ కొని యువకుడు మృతి

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్



రైలు పట్టాలు దాటుతూ ప్రమాదవ శాత్తు రైలుడికొని యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన సత్తెనపల్లి అచ్చంపేట రోడ్డులో రైల్వే గేటు సమీపంలో మంగళ వారం రాత్రి జరిగింది. ఈ ప్రమాదంలో సత్తెనపల్లి మం డలం నందిగామకి చెందిన నల బోతు ప్రసాద్ (40) మృతి చెందాడు. మృతుడు ప్రసాద్ మద్యం మత్తులో పట్టాలు దాటుతుండగా ఈ ప్రమాదం జరిగిందని పోలీ సులు తెలిపారు. రైల్వే పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ కింద పడి డ్రైవర్ మృతి

ప్రజాశక్తి -సత్తెనపల్లి రూరల్

ట్రాక్టర్ కింద పడి డ్రైవర్ మతి చెందాడు. ఈ సంఘ టన సత్తెనపల్లి మండలం రెంటపాళ్ళలో బుధవారం జరి గింది. ఈ ప్రమాదంలో రెంటపాళ్ళకి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ ఇస్తల రోశయ్య (40) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రోశయ్య ట్రాక్టర్ డ్రైవర్ గా పనిచేస్తున్నాడు. కారుమంచి రామ కోటయ్య పొలం దున్నేందుకు రోశయ్య ట్రాక్టర్ తో వెళ్ళాడు. ట్రాక్టర్ ఇంజన్ కి ఉన్న హైడ్రాలిక్ పలిటి నాగలికి బిగించి ఉన్న లిఫ్ట్ వైర్లు సరిచేయడానికి హైడ్రాలిక్ ఇనుప నాగలి రన్నింగ్ లో ఉండగానే రోశయ డ్రైవర్ సీటు కింద నుండి దూరి వైర్లు సరిచేస్తుండగా ప్రమాదవశాత్తు ఇనుప నాగలి, డ్రైవర్ సీట్ కు మద్య అతను ఇరుక్కు పోయాడు. అతని గుండెకు ఇనుప నాగలి ఒత్తుకుని మృతి చెందాడు. మృతుని భార ఇస్తల బుజ్జి ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసింది. రూరల్ సిఐ ఎం రాజేష్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



పోలీసుల మాక్ డ్రిల్

ప్రజాశక్తి - క్రోసూరు

అవాంఛనీయ ఘటనలు, అల్లరి మూకలను అదుపు చేయడం, ఘర్షణల వంటి వాటిని ఏ విధంగా ఎదుర్కోవాలి అనే తదితర అంశాల పై పల్నాడు జిల్లా అడిషనల్ ఎస్పీ డీఎస్ రామ చంద్రరాజు, సీఐ మంగారావు, ఎస్ ఐ షఫీ, పోలీస్ సిబ్బంది ఆధ్వ ర్యంలో క్రోసూరులోని పిడుగురాళ్ల బస్టాప్ సెంటర్లో మాక్ డ్రిల్ నిర్వహించారు. జూన్ 4 వ తేదీ ఓట్ల లెక్కింపు నేపథ్యంలో శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ఎలాంటి అవాంఛనీయ సంఘ టనలు జరగకుండా ఎదుర్కోనే చర్యల పై అవగాహన కల్పించారు. సుమారు 100 మంది పోలీసులతో నిర్వహించిన ఈ మాక్‌డ్రిల్ లో సన్నివేశాలు కళ్ళకు కట్టినట్టు ప్రదర్శించారు.

రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయొద్దు

ప్రజాశక్తి-తెనాలిరూరల్

సార్వత్రిక ఎన్నికల లెక్కింపు పూర్తయ్యేవరకూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని 2 టౌన్ సిఐ ఎ సుధాకర్ అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఫ్లాగ్ మార్చ్ లో భాగంగా స్టానిక లింగారావు సెంటర్, హయ్యర్ పేట ప్రాంతాల్లో ప్రజానీకానితో బుధవారం మాట్లాడారు. ఎలాంటి వైషమ్యాలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో ఓట్లు లెక్కింపు ప్రక్రియ జరుపుకోవాలని సూచించారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయరాదని స్థానికులను హెచ్చరించారు. పట్టణంలో 24 గంటలు పోలీసు నిఘా కొనసాగుతుందన్నారు. జిల్లా ఎస్పి తుషార్ దూడి, తెనాలి డిఎస్పి ఎం.రమేష్ లు పోలీసు కార్యకలాపాలను పర్యవేక్షిస్తున్నట్లు తెలి పారు. పోలీసు ఆదేశాలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు.



లింగరావు సెంటర్‌లో స్థానికులతో మాట్లాడుతున్న సిఐ సుధాకర్

గొడవలకు పాల్పడితే చర్యలు

ప్రజాశక్తి-పెదకూరపాడు

కౌంటింగ్ సందర్భంగా గ్రామాల్లో గొడవలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పెద కూరపాడు ఎస్ఐ వెంకటరావు అన్నారు. పెదకూర పాడులో బుధవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ప్రశాంతంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెదకూరపాడు సిఐ అమరావతి సిఐ క్రోసూరు నియో జకవర్గంలోని ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



పెదకూరపాడులో ఓ ఇంట్లో తనిఖీ చేస్తున్న పోలీసులు

మండుతున్న ఎండలతో ప్రజలు విలవిల

- రోహిణి కార్తెలో అధిక ఉష్ణోగ్రతలు
- మధ్యాహ్నం 12 నుండి సాయంత్రం 4 వరకు రోడ్లన్నీ నిర్మానుష్యమే
- మజ్జిగ, తాగునీటి చలివేంద్రాలు ఏర్పాటు చేయని అధికారులుట

ప్రజాశక్తి -పొన్నూరు

రోహిణి కార్తె ప్రవేశించడంతో ప్రజలు గ్రీష్మ తాపంతో విలవిలలాడుతున్నారు. గత ఐదు రోజులుగా ఉదయం 10 గంటల నుండి పట్టణ వీధుల్లో జనసంచారం తగ్గు ముఖం పట్టింది. మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. ఉష్ణోగ్రతలు రోజురోజుకి పెరుగుతుండటంతో వృద్ధులు, పిల్లలు, మహిళలు బెంబే లెత్తి పోతున్నారు. ఉష్ణోగ్రత సుమారు 45 నుంచి 47 డిగ్రీల ఉష్ణోగ్రతలకు చేరింది. అధిక ఉష్ణోగ్రతలు, విద్యుత్ అంత రాయం ఒక వైపు, మరోవైపు ఉక్కపోతతో ప్రజలు అల్లాడి పోతున్నారు. ఉక్కపోత, వడగాలు లను వృద్ధులు తట్టుకోలేక పోతున్నారు. మున్సిపల్ అధికారులు మజ్జిగ, తాగునీటి చలివేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో పొన్నూరు పరిసర ప్రాంతాల నుంచి పట్ట ణానికి వచ్చే వారందరూ మినరల్ వాటర్, మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు కొనుగోలు చేసి ఎండ తాపాన్ని అధిగమిస్తున్నారు. శీతల పానీ యాలకు మరి డిమాండ్ పెరిగింది. తాటి ముం జలు, కొబ్బరి బోండాలు, కూల్ డ్రింక్స్ కు మరింత గిరాకీ పెరిగింది. మజ్జిగ, చెరుకురసం స్టాల్స్ ప్రజలతో రద్దీ పెరిగింది. మొక్కలు, చెట్ల పెంపకంలో అధికారుల పర్యవేక్షణ లోపించ డంతో వాతావరణంలో కాలుష్యం ఏర్పడి మరింతగా ఉష్ణోగ్రతలు పెచ్చు పెరుగు తున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. ఈ విషయమై అధకారులు దృష్టి సారించాలని కోరుతున్నారు.



ఎండ తీవ్రత కారణంగా పొన్నూరులో జనసంచారం లేక ఖాళీగా ఉన్న రోడ్డు



విద్యార్థినికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

ఆర్టీసీ బస్సు ఢీ కొని యువతికి తీవ్రంగా గాయ పడింది. ఈ సంఘటన సత్తెనపల్లి మండలం రామ కృష్ణా పురం గురుకుల పాఠశాల సమీపంలో చోటు చేసు కుంది. ఈ ప్రమాదంలో సత్తెనపల్లి పట్టణానికి చెందిన నం దం అనురాధ తీవ్రంగా గాయపడింది. గురుకుల పాఠశాలలో జరుగుతున్న పదోతరగతి సప్లిమెంటరీ పరీక్షలకు హాజరై తిరిగి సత్తెనపల్లి వచ్చేందుకు అటో ఎక్కు తుండగా సత్తెనపలి-గుంటూరు వెళుతున్న బస్సు ఢీ కొట్టింది. గాయపడ్డిన ఆమెని 108 వాహనం ద్వారా సత్తెనపల్లి ఏరియా ప్రభుత్వ వైద్య శాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తు న్నారు.

వాచ్ మెన్‌పై యువకులు దాడి

ప్రజాశక్తి -సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి పట్టణంలోని రఘురాంనగర్ కన్నా క్యాంపు కార్యాలయం వాచ్‌మెన్‌పై మద్యం మత్తులో యువకులు మంగళవారం రాత్రి దాడిచేశారు. వాచ్ మెన్ కొండలు పై దాడి చేశారు. నలుగురు యువకులు మద్యం సేవించి కొండలుపై దాడికి పాల్పడ్డారు. ఈ మేరకు వాచ్‌మెన్ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణ సిఐ ఆ ప్రాంతంలో ఉన్న సిసి పుటేజిని పరి శీలిం చారు. నిందితులను గుర్తించి అదుపులోకి తీసు కున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

ఈ ప్రయా(ప్రా)ణాలు అటో-ఇటో?

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లాలో వివిధ ప్రాంతాలలో ఆటో ప్రయా ణం అంటేనే ప్రమాదకరంగా మారిన పరిస్థితి నెలకొంది. ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులను తరలి ంచడం, సరుకు రవాణా వాహనాల్లోనూ పరిమితికి మించి కూలీలను తరలిస్తున్నారు. బస్సు సౌకర్యం లేని గ్రామాల ప్రజలు జీవనో పాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రజలు కూలీలు ఆటో లనే ఆశ్రయిస్తున్నారు. పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తున్న వాహనాలను కట్టడి చేయడంలో అధి కారులు విఫలమవుతున్నారని కేవలం పత్రాల తనిఖీ, అపరాధ రుసుం సరిపెట్టుకుంటున్నారన్న విమర్శలు ఉన్నాయి. అధికారులు ప్రమాదాల పరంపర, క్షేత్రస్థాయి పరిస్థితులను విశ్లేషించి తగు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఇటీవల రొంపిచర్ల మండలం నల్లగార్లపాడు గ్రామ సమీపంలో పరిమితికి మించి వ్యవసాయ కూలీలు వెళు తున్న ఆటో బోల్తా పడి కులీలు మతి చెందిన దాఖలాలు ఉన్నాయి. పరిమితికి విద్యార్థులను తరలిస్తున్న పాఠశాల బస్సులు తనిఖీ చేయాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం పల్నాడు జిల్లాలో వ్యవ సాయ పనులు లేకపోవడంతో బాపట్ల ప్రకాశం జిల్లాలకు పొగాకు పనులకు కూలీలు తరలి వెళుతున్నారు. ఒక ప్రాం తం నుంచి మరో ప్రాంతానికి ఆటోలలో కూలీలు, చిన్నారు లను తరలిస్తున్న అధికారులు తమకేమి పట్టన్నట్లు వ్యవ హరిస్తుండటం గమనార్హం. ప్రమాదాల నివారణకు రోడ్డు భద్రత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



సరుకు రవాణా వాహనంలో 30 మందికి పైగా వెళుతున్న యువకులు



వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్, ఎస్పీ, జెసి, డిఆర్వో

ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ఓట్ల లెక్కింపు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలను అనుసరిస్తూ ఓట్ల లెక్కింపు ప్రక్రియ సాగాలని సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీష్ వ్యాస్ సూచించారు. ఓట్ల లెక్కింపు సన్నద్ధతపై డిఈఓలు, సీపీలు, ఎస్పీలు, తదితరులతో దేశ రాజధాని న్యూఢిల్లీ నిర్వచన్ సదన్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బుధవారం సమీక్షించారు. సమావేశంలో పల్నాడు కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లత్కర్ బాలజీరావు, ఎస్పీ మలిక గర్గ్, జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్, డిఆర్వో కె.వినాయకం సంబంధిత అధికారులు పాల్గొన్నారు. నితీష్ వ్యాస్ మాట్లాడుతూ త్వరితగతిన కచ్చితమైన ఫలితాల ప్రకటనకు, శాంతి భద్రతల పరిరక్షణకు నియోజకవర్గాల వారీగా ఇప్పటి వరకు చేసిన ఏర్పాట్లను, తీసుకుంటున్న చర్యలు గురించి తెలుసుకున్నారు. ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ ప్రక్రియ సాగేలా అధికారులు బాధ్యతాయుతంగా పని చేయాలని ఆదేశించారు.



శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పల్నాడు జిల్లా అడిషనల్ ఎస్పీ సోమశేఖర హెచ్చరించారు. సత్తెనపల్లి పట్టణంలో ప్రత్యేక పోలీసు బలగాలతో బుధవారం కవాతు నిర్వహించారు. పట్టణ పోలీస్ స్టేషన్ నుండి ఆంజనేయ స్వామి టెంపుల్ గార్లపాడు రోడ్డు, నాగన్నకుంట, ముస్లిమ్‌పేటలో కవాతు సాగింది. ఈ సందర్భంగా ఎఎస్‌పి మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు సందర్భంగా అల్లర్లకు పాల్పడితే రౌడీషీట్లు ఓపెన్ చేస్తామని చెప్పారు. హింసాత్మక సంఘటనలకు పాల్పడితే పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు ప్రజలు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సత్తెనపల్లి డీఎస్పీ జి.గురునాథ్‌బాబు, పట్టణ సిఐ శ్రీనివాసరావు, రూరల్ సిఐ ఎం.రాజేష్‌కుమార్, ఎస్ఐలు సత్యనారాయణ, సంధ్యారాణి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



క్లాప్ ఆటోల నిర్వహణలో ప్లాప్

- ఆరునెలలకు పైగా మూలన పడేసిన వాహనాలు
- జీతాలు దక్కక, పనిలేక డ్రైవర్ల అవస్థ
- 10 పుష్‌కార్డుల ద్వారా వ్యర్థాలను తరలించలేక పారిశుధ్య కార్మికుల సతమతం - పలు వార్డుల్లో వ్యర్థాల గుట్టలలు

మున్సిపాల్టీల్లో చెత్త తరలింపు కోసం ఆర్భాటంగా తెచ్చిన క్లాప్ ఆటోలు ఏడు నెలలుగా మూలన పడ్డాయి. తొలుత వీటికి డ్రైవర్లుగా పని చేసిన వారికి గతేడాది మే నుంచి నవంబర్ వరకు జీతావ్వకుండా పని చేయించుకోగా డిసెంబర్ నుండి ఇప్పటి వరకు పనికే పిలవడం మానేశారు. దీంతో చెత్త తరలింపు భారం మున్సిపల్ కార్మికులపై పడింది. మరోవైపు పట్టణంలో ఎక్కడంటే అక్కడ వ్యర్థాలు గుట్టలుగుట్టలుగా పేరుకుని ప్రజలకు రోగాల ముప్పు పొంచి ఉంది.

ప్రజాశక్తి - చిలకలూరిపేట

చిలకలూరిపేట పట్టణంలో 31 వార్డులుండగా లక్ష వరకు జనాభా ఉన్నారు. రోజుకు 30-40 టన్నుల వరకూ వ్యర్థాలు వస్తాయనేది అంచనా. ఈ వ్యర్థాలను తరలించడానికి స్వచ్ఛభారత్ కింద గతేడాది ఏప్రిల్ నుండి 20 క్లాప్ ఆటోలను పట్టణానికి కేటాయించారు. వీటి నిర్వహణను రెడ్డి ఎంటర్ప్రైజెస్ మెన్ పవర్ సోర్సింగ్ ఏజెన్సీ గుంటూరుకు కాంట్రాక్టు కింద అప్పగించారు. ఈ సంస్థ 20 ఆటోలకు 22 మంది డ్రైవర్లను నెలకు రూ.10 వేలు జీతం ఇచ్చేలా నియమించింది. అయితే వీరికి గతేడాది మే నుండి నవంబర్ వరకూ జీతాలివ్వలేదు. డిసెంబర్ నుండి అసలు పనులకే పిలవడం మానేశారు. ఆటోలను చెత్త తరలింపునకు వినియోగించకుండా స్థానిక మార్కెట్ యార్డు ప్రాంగణంలో నిలిపేశారు.

ఈ నేపథ్యంలో పట్టణంలోని వ్యర్థాలన్నింటినీ మున్సిపల్ పారిశుధ్య కార్మికులే తరలించాల్సి వస్తోంది. పట్టణంలో 253 మంది మున్సిపల్ పారిశుధ్య కార్మికులున్నారు. వీరంతా వీధులు శుభ్రం చేయడంతోపాటు చెత్తను సైతం ట్రాక్టర్లలో ఎత్తాల్సి వస్తోంది. మూడు వార్డులకు కలిపి ఒక పుష్‌కార్డు చొప్పున 10 మాత్రమే పుష్‌కార్డులు ఉన్నాయి. చెత్తను పట్టనానికి మూడు కిలోమీటర్ల దూరంలోని మానుకొండవారిపాలెం దగ్గరున్న డంపింగ్ యార్డుకు తరలించడానికి నాలుగు ట్రాక్టర్లు ఉన్నాయి. మూడు వార్డులకు కలిపి ఒక ప్రాంతం వద్ద ట్రాక్టర్ నిలిచి ఉంటే ఆ వార్డుల్లోని వ్యర్థాలన్నింటినీ కార్మికులు పుష్‌కార్డు ద్వారా తెచ్చి ట్రాక్టర్‌ల్లో వేయాలి. ఇది వారికి చేయలేని చాకిరి అవుతోంది.

ఒకవైపు చెత్త తరలింపు కోసం వచ్చిన వాహనాలు ఆరేడు నెలలుగా నిరుపయోగంగా పడి ఉండగా వాటి పనినీ కార్మికులు చేయాల్సిన దుస్థితి నెలకొంది. దీనికితోడు నెలల తరబడి ఉపయోగించని కారణంగా ఆటోలు సైతం దెబ్బతినే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా తమను పనికేమైనా పిలుస్తారేమోనని క్లాప్ ఆటో డ్రైవర్లు నెలల తరబడి నిరీక్షిస్తున్నారు. ఇప్పటికే జీతాలు దక్కని తాము అప్పులు చేసి కుటుంబాలను పోషించాల్సి వస్తోందని, మరోవైపు పనికి కూడా పిలవడం లేదని వారు ఆవేదనకు గురవుతున్నారు. అధికారులు స్పందించి దీనిపై చర్యలు తీసుకోవాలని, తమకు పెండింగ్ జీతాలు ఇవ్వడంతోపాటు ఆటోలను వినియోగంలోకి తేవడం ద్వారా తమను పనిలోకి తీసుకోవాలని కోరుతున్నారు.

వడ్డీలకు తెచ్చి సెక్యూరిటీ కట్టాం..

ఉద్యోగంలోకి తీసుకునేటప్పుడు రూ.20 వేలను సెక్యూరిటీగా డిపాజిట్ చేయాలంటే అప్పులు చేసి మరీ వాటిని చెల్లించాం. ఐదు నెలలపాటు జీతాలివ్వకుండా పని చేయించుకున్నారు. తర్వాత బండ్లనే ఆపేశారు. దీనిపై అధికారులు, కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులను సంప్రదించినా సరైన స్పందన లేదు. ఇంటిని గడపడానికి అప్పులు చేయడం, వాటికి వడ్డీలు చెల్లించలేక నానా తంటాలు పడుతున్నాం. తమకు పెండింగ్ జీతాలిచ్చి విధుల్లోకి తీసుకోవాలి.



నిడమానూరి శరత్, క్లాప్ ఆటో డ్రైవర్లు అసోసియేషన్ చిలకలూరిపేట అధ్యక్షులు

మాకు సంబంధం లేదు

క్లాప్ ఆటో డ్రైవర్ల జీతాలు, ఇతర వ్యవహారాలతో మున్సిపాల్టీకి సంబంధం లేదు. అది వారికి, కాంట్రాక్టర్‌కు మధ్య విషయం. ప్రజలు చెత్త పన్నును సరిగా చెల్లించని కారణంగా ఆ వాహనాలు ఆగిపోయాయి.



సిహెచ్.గోవిందరావు, మున్సిపల్ కమిషనర్, చిలకలూరిపేట.

నేడు పుతుంబాక వెంకటపతి వర్ధంతి సభ

ప్రజాశక్తి-సత్తెనపల్లి

పీడిత ప్రజల ప్రియతమ నాయకుడు, రైతు ఉద్యమ నేత, సిపిఎం సత్తెనపల్లి మాజీ ఎమ్మెల్యే పుతుంబాక వెంకటపతి 31వ వర్ధంతి సభ గురువారం సత్తెనపల్లి పాత బస్టాండ్‌లోని పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరుగుతుందని ఆ పార్టీ పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ బుధవారం తెలిపారు. పుతుంబాక వెంకటపతి చిన్న వయసులోనే కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తగా ఉద్యమాల బాట పట్టారని, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం యోధులకు అవసరమైన సహాయ సహకారాలు అందించారని అన్నారు. నాగార్జునసాగర్ డ్యాం నిర్మించాల్సిందేనని 1954లో సత్తెనపల్లిలో 50 వేల మంది రైతులతో సభ జరిగిందని, ఆ సభ జయప్రదం చేయడం కోసం వెంకటపతి చురుకైన పాత్ర వహించారని చెప్పారు. ప్రజా సమస్యలపై పోరాటాల నిర్వహణలో జైలు జీవితం, అజ్ఞాత జీవితం అనుభవించారని తెలిపారు. ఊటుకూరు సర్పంచ్‌గా, ఫిరంగిపురం సమితి ప్రెసిడెంట్‌గా, సత్తెనపల్లి నియోజకవర్గ శాసనసభ్యులుగాను పదవి బాధ్యతలు నిర్వహించి కమ్యూనిస్టు ప్రజా ప్రతినిధులు ఎలా పనిచేస్తారో చూపించారని అన్నారు. సాగర్ కాల్వల మరమ్మతుల సమస్యలపై, పంటలకు మద్దతు ధరల సమస్యలపై అనేక ఉద్యమాలను వెంకటపతి నడిపారని అన్నారు. ఉద్యమమే ఊపిరిగా సాగిన ఆయన 1992 మే 30వ తేదీన 88 తాళ్లూరు మృతవీరుల స్మారక సభకు సన్నాహక ఏర్పాట్లు కోసం తిరుగుతూ అలసిపోయి తీవ్ర గుండెపోటుకు గురై మరణించారని తెలిపారు. నాటినుండి ప్రతి సంవత్సరం మే 30వ తేదీన సత్తెనపల్లిలో పుతుంబాక వెంకటపతి సంస్మరణ సభ జరుగుతుందని చెప్పారు. గురువారం నిర్వహించే సిపిఎం రాష్ట్ర కమిటీ మాజీ సభ్యులు గద్దె చలమయ్య, పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.ఆంజనేయులు నాయక్ పాల్గొంటారని, సిపిఎం శ్రేణులు, అభిమానులు సభను జయప్రదం చేయాలని కోరారు.



అప్పుడు ధీమా.. ఇప్పుడు భయం..

ఓట్ల లెక్కింపు తేదీ దగ్గరపడుతున్న కొద్దీ అభ్యర్థుల్లో కంగారు

మెజార్టీ పక్కనపెట్టి గెలిస్తే చాలని ఆత్రుత - రోజులు లెక్కబెట్టుకుంటూ నిరీక్షణ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

సార్వత్రిక ఎన్నికల ఫలితాల వెల్లడికి మరో ఆరురోజులే ఉంది. అభ్యర్థుల భవితవ్యంపై జనమిచ్చిన తీర్పు ఈవీఎం బాక్సుల్లో నుండి బయటకు వచ్చే సమయం దగ్గర పడుతున్న కొద్దీ సర్వత్రా ఉత్కంఠ పెరుగుతోంది. ఇదే క్రమంలో తమ అంచనాలు ఫలిస్తాయా? లేదా? అనే విషయమూ అభ్యర్థులను కంగారు పెడుతోంది. ఎవరికి వారు తాము అంతర్గతంగా చేయించుకున్న సర్వేలు, ద్వితీయ శ్రేణి నాయకుల సమాచారంపై ఆధారంగా లెక్కలేసుకున్నా సరైన స్పష్టత రాకపోవడంతో టెన్షన్ పెరుగుతోంది. ఎన్నికల ముందు మెజార్టీపై లెక్కలేసుకున్న వారు ఇప్పుడు గెలిస్తే చాలు.. అనే దశకు వచ్చారు.

పోలింగ్ ముందు హోరాహోరీ ప్రచారం చేసుకున్న అభ్యర్థులు పోలింగ్ రోజున ఓటరు బారులు చూసి తమకు పడే ఓట్లపై అంచనాలు మొదలుపెట్టారు. ఓటేయడానికి వచ్చినవారంతా సంక్షేమ పథకాల ప్రభావంతో వచ్చారా? ప్రభుత్వంపై వ్యతిరేకతతో వచ్చారా? అనే నిర్దిష్ట అంచనాకు మాత్రం రాలేకపోయారు. పైకి ఎవరికి వారు ధీమాగా కనిపిస్తున్నా లోలోపల మాత్రం గెలుపుపై అందరికీ అస్పష్టతే. గత ఎన్నికలలో పల్నాడు జిల్లా వ్యాప్తంగా పార్లమెంట్ స్థానంతో పాటు 7 అసెంబ్లీ స్థానాలను వైసిపి కైవసం చేసుకుంది. ప్రస్తుత ఎన్నికల్లో పోటీ తీవ్రంగా ఉండడంతో గెలుపుపై కచ్చితంగా ఎవరికీ నమ్మకం కుదరడం లేదు.



నరసరావుపేట పార్లమెంటు పరిధిలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియతో కలిపి సగటున 86.06 శాతం పోలింగ్ శాతం నమోదైంది. మొత్తం 17,34,858 మంది ఓటర్లు ఉండగా 14,86,594 మంది ఓటేశారు. 8,88,159 మంది మహిళా ఓటర్లుండగా వీరిలో 7,58,988 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 8,46,508 మంది పురుష ఓటర్లుండగా 7,27,518 మంది, 191 మంది ఇతరులు ఉండగా 88 మంది ఓటేశారు. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం సమయంలో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి గెలుపు ధీమాతో ఉన్నారు. తాను హ్యాట్రిక్‌ను సులువుగా సాధిస్తానని, అయితే ఎక్కువ మెజార్టీ కోసం కష్టపడుతున్నానని చెప్పారు. పోలింగ్ అనంతరం ఈ ధీమా కనిపించడం లేదని తెలిసింది. టిడిపి అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవిందబాబు 2019 ఎన్నికల్లో ఓడిపోవడం, అయినా ప్రజల్లోనే ఉండడం, ఈ సారి కూడా పోటీ చేయడం వల్ల తనపై ప్రత్యేక సానుభూతితోపాటు ప్రభుత్వపై ఉన్న వ్యతిరేకతా కలిసి వస్తుందని ఆశాభావంతో ఉన్నారు.





తెనాలి మార్కెట్ వంతెన సమీపంలో కాలువల్లో వ్యర్థాలు, ఆటోనగర్ వద్ద కాలువ అంచున వేసిన వ్యర్థాలు

కాల్వల్లో పేరుకున్న వ్యర్థాలతో సాగు,తాగు నీటి సమస్య

- పట్టణంతో పాటు వెలుపలా అదే పరిస్థితి
- శాఖల మధ్య సమన్వయ లోపం
- నోటీలిచ్చినా పట్టించుకోవటంలేదంటున్న ఇరిగేషన్ అధికారులు
- అలాంటిదేమీ లేదంటున్న మున్సిపల్ అధికారులు

ప్రజాశక్తి-తెనాలి

కాలువల్లో పేరుకుపోతున్న వ్యర్థాలు సాగు, తాగునీటి ప్రవాహానికి అడ్డంకిగా మారుతున్నాయి. రోజురోజుకూ ఈ పరిస్థితి దయనీయంగా మారుతోంది. కెనాల్స్‌లో వ్యర్థాలు పేరుపోవటంపట్ల ఇరిగేషన్ శాఖ అధికారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో కొత్తవంతెన, మార్కెట్ కూడలి, బస్టాండ్ తదితర ప్రాంతాల్లో ఈ పరిస్థితి కనిపిస్తే, పట్టణం వెలుపల ఆటోనగర్, సోమ సుందరపాలెం ప్రాంతాల్లోనూ కాలువ అంచున వ్యర్థాలు వేస్తున్నారు. దీనిపై మున్సిపల్ అధికారులకు నోటీసులు ఇచ్చినా స్పందించటం లేదని ఇరిగేషన్ అధికారులు చెబుతుంటే, అలాంటిదేమీ లేదని మున్సిపల్ అధికారులు కొట్టి పారేస్తున్నారు.

పట్టణంలో తూర్పు, పడమర, నిజాంపట్నం కాలువులు ప్రవహిస్తుంటాయి. ఈ కాలువల ద్వారా ప్రవహించే నీరు డెల్టా ప్రాంతంలోని దిగువ ప్రాంత రైతులకు సాగు, తాగు నీరుగా కూడా ఉపయోగపడుతుంది. అయితే ఈ నీరు విపరీతంగా కలుషితమౌతోంది. పట్టణంలోని కూర గాయలు, మాంసం మార్కెట్ నుంచి వెలువడే వ్యర్థాలు మార్కెల్ వంతెన ప్రాంతంలో తూర్పు కాలువలో పడవేస్తున్నారు. అలాగే వివిఎస్సార్ కళాశాల సమీపంలో, బస్టాండ్ వంతెన, కొత్త వంతెన, ముత్తింశెట్టి వారిపాలెం వంతెనల వద్ద కూడా ఆయా ప్రాంతాల్లోని వ్యాపార కూడళ్లు, ఇళ్ళ నుంచి వెలువడే వ్యర్థాలు కాలువల్లో వేస్తున్నారు. ఇదిలా ఉంటే వివిఎస్సార్ కళాశాల నుంచి ఆటో నగర్ వరకూ తూర్పు, పడమర కాలువల వెంట వ్యర్థాలను పెద్ద ఎత్తున డంప్ చేస్తున్నారు. ప్రత్యేకంగా ట్రాక్టర్లు, లారీల్లో ఎక్కడెక్కడి నుంచో తెచ్చి పడేస్తున్నట్లు సమాచారం. ఇవన్నీ కూడా క్రమంగా కాలువల్లోకే చేరుతున్నాయి. జూన్ మొదటి వారంలో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో సాగునీరు విడుదల చేసినా ప్రవాహానికి వ్యర్థాలు అడ్డంకిగా మారుతాయని ఇరిగేషన్ అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితిపై మున్సిపల్ అధికారులకు, సంబందిత కౌన్సిలర్లకు కూడా ప్రతి నెలా నోటీసులు ద్వారా సమాచారం ఇస్తున్నా ఏమాత్రం పట్టించు కోవటం లేదని ఇరిగేషణ్ అధికారులు చెబుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే నీరు కలుషితమేమోగాని, సాగునీరు దిగువ ప్రాంతానికి వెళ్లే అవకాశం ఉండదు. ఇది రైతులకు ఇబ్బందికర పరిణామమే. ఇప్పటికైనా పరిస్థితిని చక్కదిద్దేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

నోటీసులిచ్చినా పట్టించుకోవటం లేదు



ఎస్.మల్లికార్జున, ఈఈ, ఇరిగేషన్, తెనాలి

పట్టణంలో ప్రవహించే మూడు కాలువల్లో పట్టణ ప్రాంతాల్లో వ్యర్థాలు పడేస్తున్నారు. దీనిపై పురపాలక సంఘం అధికారులకు, కౌన్సిలర్లుకు తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా కోరుతూ నోటీసులు ప్రతి నెలా జారీ చేస్తున్నాం. వారి నుంచి ఎలాంటి స్పందన లేదు. పరిస్థితిలో మార్పులేదు. అలాగే ఆటోనగర్, సోమ సుందరపాలెం ప్రాంతాల్లో లారీలు, ట్రాక్టర్లతో తరలించిన వ్యర్థాలను కాలువ అంచున వేస్తున్నారు. అవి కూడా కాలువల్లోకే చేరుతున్నాయి. ఖరీఫ్ ప్రారంభం కానున్న నేపథ్యంలో సాగునీటి ప్రవాహానికి ఇవి అడ్డంకి.

కచ్చితంగా చర్యలు తీసుకుంటాం



బి.శేషన్న, మున్సిపల్ కమిషనర్, తెనాలి

మున్సిపల్ వ్యర్థాలు కాలువల్లో వేసే అవకాశం లేదు. అలా చేయం కూడా. పట్టణంలో సేకరించిన చెత్తనంతా డంపింగ్ యార్డుకే తరలిస్తాం. అయినా దీనిని పరిశీలిస్తాం. మున్సిపల్ చెత్తను కాలువల్లో పడేసినట్లు ఉంటే ఖచ్చితంగా సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటాం. దీనిపై ఇరి గేషన్ అధికారుల నుంచి మాకు ఎలాంటి నోటీసులు లేవు.

ఏఎన్ఎం, ఆశాలకు ఎన్నికల అలవెన్స్ ఇవ్వాలి

ప్రజాశక్తి-గుంటూరు :ఎన్నికల విధులు నిర్వహించిన ఏఎన్ఎం, ఆశాలకు వెంటనే ఎన్నికల అలవెన్స్ చెల్లించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజి డిమాండ్ చేశారు. పాతగుంటూరు సిఐటియు కార్యా లయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లా డుతూ ఈ అంశంపై ఇప్పటికే డిఎంహెచ్ఒకు, కలెక్టర్ కార్యాలయంలో డిఆర్ఓకు వినతిపత్రం అంద చేసినట్లు చెప్పారు. సార్వత్రిక ఎన్నికలు మన రాష్ట్రంలో మే



మాట్లాడుతున్న వై నేతాజి, దండా లక్ష్మీనారాయణ

13వ తేదీన జరిగినప్పటికీ ఇంత వరకూ ఎలక్షన్ కమిషన్ నిబంధనలకు అను గుణంగా మెడికల్ క్యాంపులు నిర్వహించిన ఆశాలకు, ఏఎన్ఎం లకు అలవెన్స్ ఇవ్వకపోవడం బాధాకరమని అన్నారు. పల్నాడు జిల్లాలో విధులు నిర్వ హించిన వారందరికీ అదేరోజు అలవెన్స్‌లు చెల్లించారని అన్నారు. ఎలక్షన్ కమిషన్ నిబంధనలకు అను గుణంగా విధులు నిర్వహించిన గుంటూరు జిల్లాలోని ఏఎన్ఎం, ఆశాలకు ఎందుకు అలవెన్సులు ఇవ్వలేదని ప్రశ్నించారు. తక్షణమే ఆలవెన్స్ చెల్లింపుకు జిల్లా కలెక్టర్ తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు దండా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పెదనందిపాడు తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో

ఉత్సాహంగా, ఉల్లాసంగా ముగిసిన సమ్మర్ క్యాంప్

నిర్వాహకులకు పలువురు అభినందన

ప్రజాశక్తి పెదనందిపాడు రూరల్

పిల్లల వేసవి శిక్షణా శిబిరాలు వారి మనో వికాసానికి దోహదం చేస్తాయని ప్రజా నాట్యమండలి గుంటూరు జిల్లా కార్యదర్శి దేవరకొండ శ్రీనివాసరావు అన్నారు. తేళ్ళ నారాయణ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యములో నిర్వహిస్తున్న చిల్డ్రన్స్ సమ్మర్ క్యాంప్ 5 వ రోజు బుధవారం విజ్ఞాన కేంద్రం నిర్వహణ కమిటీ కో కన్వీనర్ కొత్తా వెంకట శివరావు అధ్యక్షతన ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన శ్రీనివాసరావు మాట్లాడుతు ఈ సమ్మర్ క్యాంప్‌లో చిన్నారులు పాల్గొని నేర్చుకున్న వాటిని నిత్యం మననం చేసుకుంటూ అభివృద్ధి పథంలో నడవాలని అన్నారు. వారికి ఒక దేశభక్తి గీతం నేర్పించారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం పూర్వ కార్యదర్శి నన్నపనేని శివప్రసాద్ పాల్గొని మరొక దేశభక్తిగీతాన్ని పిల్లల చేత పాడించారు. ప్రసాద్ మాట్లాడుతూ ఈ సమ్మర్ క్యాంప్ ను సద్వినియోగ పర్చుకున్నందుకు సంతోషంగా ఉందని, పిల్లలకు ఇలాంటి క్యాంప్ లు వారి మానసిక ఉల్లాసానికి ఉపయోగపడతాయని అన్నారు. ఈ సందర్భంగా నిర్వా హకులను అభినందించారు. ముగింపు సభలో క్యాంప్‌లో పాల్గొన్న పిల్లలందరికీ సర్టిఫికేట్‌లను అందజేశారు. చిన్న



వేసవి శిక్షణ ముగింపు సందర్భంగా చిన్నారులకు సర్టిఫికెట్‌లు అందజేస్తున్న శ్రీనివాసరావు వేదికపైన డి.రమేష్‌బాబు తదితరులు

పిల్లలకు డ్రాయింగ్ పుస్తకాలు పంచిపెట్టడం జరిగింది. ముగింపు సభలో విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ కమిటీ కన్వీనర్ దొప్పలపూడి రమేష్ బాబు మాట్లాడారు. విజ్ఞాన కేంద్రాలు ప్రజా ప్రయోజనాలకు కేంద్రాలుగా పనిచేస్తాయన్నారు. ఇటీవల నిర్వహించిన కుట్టు శిక్షణా కేంద్రం కూడా మహిళలకు ఉపయోగపడిందన్నారు. విజ్ఞాన కేంద్రం ద్వారా పలు కార్యక్రమాలు నిర్వహిస్తామని, సమ్మర్‌క్యాంప్ ప్రతి సంవత్సరము కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో జంపని రామారావు, చుక్కా యానాదులు, మర్రిలక్ష్మి, విద్యార్థినీ విధ్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులను విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందించారు.



మాట్లాడుతున్న డిఎంహెచ్ డాక్టర్ విజయలక్ష్మి

ప్రైవేటు ఆసుపత్రులు, లేబోరేటరీల రిజిస్ట్రేషన్ తప్పనిసరి

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.విజయలక్ష్మి అధ్యక్షతన బుధవారం డిఎంహెచ్ఒ కార్యాలయంలో ఆరోగ్యశ్రీ కింద అనుసంధానం అయిన ప్రైవేటు ఆసుపత్రుల యాజ మాన్యాలకు ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ గురించి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఒ మాట్లాడుతూ ప్రతి ప్రైవేటు ఆసుపత్రి, లేబోరేటరీ తప్పనిసరిగా హెల్త్ ఫెసిలిటీ రిజిస్ట్రేషన్, హెల్త్ పర్సనల్ రిజిస్ట్రీని మెయింటెన్ చేయాలని, ఈ ప్రక్రియకు టెక్నికల్ సపోర్ట్ ఇవ్వటానికి గుంటూరు జిల్లాకు భవ్య హెల్త్‌కేర్ ప్రైవేటు లిమిటెడ్ అండ్ ఎంట్రో ల్యాబ్‌ను ఏజెన్సీ ముందుకు వచ్చిందని, కావున ప్రతి ప్రైవేటు ఆసుపత్రి ల్యాబ్‌ల యాజమాన్యాలు వారికి సహకారం అందించి, ఆయుష్మాన్‌భారత్ డిజిటల్ మిషన్ ప్రక్రియలో భాగాంగా హెచ్ఎఫ్ఆర్, హెచ్‌పిఆర్ డేటాను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కోరారు. జిల్లాలో ఉన్న 811 ప్రైవేటు ఆసుపత్రులకు కేవలం 166 ఆసుపత్రులు మాత్రమే రిజిస్టర్ చేయించుకున్నారని తెలియజేశారు. ప్రతినెలా 8, 9, 10 తేదీల్లో ఆరోగ్య కేంద్రాలలో జరిగే పియంఎస్‌యంఎ కార్యక్రమంలో రెఫర్ చేసిన గర్భిణీ స్త్రీలకు ఉచితంగా, టిఫ్ఫాస్కాన్ చెయ్యాలని, దాని కింద వారికి ప్రభుత్వం, ఆ ఆసుపత్రులకు రూ.1100లు అందచేయటం జరుగు తుందన్నారు. సాధారణ స్కాన్ కింద రూ.250లు అందజేయటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ విజయప్రకాష్ పాల్గొన్నారు.



చికిత్సల్లో నిర్లక్ష్యం తగదు

జిజిహెచ్ సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రభుత్వ ఆసుపత్రి కార్డియాలజీ విభాగం ఓపి లో అన్ని రకాల పరీక్షలకు సంబంధించి పరికరాలను అందుబాటులో ఉంచిన కొంతమంది పని చేయకపోవడం బాధ్యతారాహిత్యం అవుతుందని సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ అన్నారు. బుధవారం గుండె జబ్బుల ఓపి ని ఆయన పరిశీలించారు. గుండె జబ్బుల ఓపి లో కనీసం అసిస్టెంట్ ప్రొఫెసర్ కూడా లేకపోవడం పై ఆయన అసంతప్తి వ్యక్తం చేసారు. ఆసుపత్రి పై నమ్మకం తో పెద్ద సంఖ్య లో రోగులు వస్తుంటే వారిని పరిక్షించేందుకు వైద్యులు, టెక్నిషియన్లు కనిపించక పోవడం తో ఆయన విచారం వ్యక్తం చేసారు. గుండె జబ్బుల ఓపి ప్రతిరోజూ ఉంటుందని చెప్పిన విధులకు హాజరు కావడం లేదని ఆయన అన్నారు. ఈ ఓపి లో ఈసీజీ, ఏకో పరికరాల తో పాటు అన్నీ రాకల సదుపాయాలు ఏర్పాటు చేశామని ఆయన అన్నారు. పొదిల ప్రసాద్ బ్లాక్ లో ఏకో ఉండటంతో అక్కడ రోగుల రద్దీ విపరీతంగా పెరుగుతున్న దృష్ట్యా ఓపిలో ఏకో ఉండేవిధంగా చర్యలు తీసుకున్నామని ఆయన చెప్పారు. ఈ ఓపి లో టెక్నిషయన్ లేకపోతే ఎలా అంటూ ఆయన ప్రశ్నించారు. ప్రతిరోజూ ఓపి లో ఏకో పరీక్షలు, ఈ సి జి పరీక్షలు చేయాల్సిందేనని ఎవరికైన ఇష్టం లేకపోతే వెళ్లిపోవాలని అవసరమైతే నా పద్ధతులు నచ్చకపోతే నన్ను కూడా బయటకు పంపించాలని అయన తెలిపారు. ఈ విభాగానికి ఆరుగురు పిజి లు ఉన్నారని ప్రతిరోజూ ఓపి కి వచ్చి రోగులను చూడాల్సిన బాధ్యత ఉందని ఆయన సూచించారు. భార మంతా పీజీ ల పై వెయ్యడం మంచి పద్దతి కాదన్నారు. రోగులను చూసేందుకు కనీసం అసిస్టెంట్ స్థాయి ప్రొఫెసర్ ఉండాలని అదేవిధంగా పీజీలు కూడా ఉండాలని అయన చెప్పారు.

సామాజిక పింఛన్లు బ్యాంకు ఖాతాల్లోనే

కమిషనర్ సిహెచ్‌గోవిందరావు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలోని పింఛన్ దారులకు జూన్ నెలలో ఇవ్వనున్న సామాజిక భద్రతా పింఛన్లు మే లో ఇచ్చినట్టుగా ఎవరి బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ సిహెచ్ గోవిందరావు అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యా లయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బ్యాంకు ఖాతాల్లోనే జూన్ పింఛ న్లను జమ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. వికలాంగులు, నడవలేని వారికి మాత్రం ఇంటి వద్దే పింఛన్ ఇచ్చే సౌకర్యం సచి వాలయ ఉద్యోగుల ద్వారా కల్పించామన్నారు.



విద్యార్థికి లాప్‌టాప్ అందజేత

ప్రజాశక్తి -పెదకూరపాడు

మాగులూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎన్నారై మాగులూరి భాను ప్రకాష్ సహకారంతో గ్రామానికి చెందిన ఇంజనీరింగ్ విద్యార్థిని వేముల అనంతలక్ష్మికి లాప్‌టాప్ అందించారు. బుధవారం పెదకూరపాడు మండల టిడిపి అధ్యక్షులు రమేష్ గృహంలో ఇచ్చారు. కార్యక్రమంలో టిడిపి డాక్టర్ సెల్ కార్యదర్శి గుడిపూడి చిన్న రాజు, ఫౌండేషన్ ప్రతినిధులు ఎం.కృష్ణారావు, కిరణ్ పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజనం నిర్వాహకులకు ఒక్క రోజు శిక్షణ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

మండల కేంద్రం రొంపిచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం మండలంలోని అన్ని ప్రభుత్వ పాంశాలల్లోని మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ శిక్షణ కార్య క్రమంలో వారికి షోషక విలువల లోపం లేకుండా వంట చేసే విధానం గురించి వివరించారు. పాఠశాలలు తిరిగి ప్రారంభమయ్యే రోజుకు మధ్యాహ్న భోజన పథకం నిర్వా హకులు సన్నద్ధం కావాలని కోరారు. అనంతరం వారికి వంటల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహు మతులు అందజేశారు. ఉపాధ్యాయురాలు వై.భారతిరిసోర్స్ పర్సన్ గా వ్యవహరించారు. కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారి రాజనాల కల్యాణ్‌రావు, మండల విద్యా శాఖా అధికారులు వై.ఏసు బాబు, డి.బ్రహ్మేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు బిఎం సుభాని పాల్గొన్నారు.



గొడవలు,అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు

- చింతల తండా, కోలగట్ల,లక్ష్మీపురం తండా,మాచర్లలో కార్డన్ సెర్చ్
- ధ్రువీకరణ పత్రాలు లేని బైక్‌లు స్వాధీనం
- గ్రామాల్లో ఏదైనా సమస్య వస్తే సంప్రదించండి: పోలీసులు

ప్రజాశక్తి - విజయపురిసౌత్

ఎన్నికల ఫలితాల నేపథ్యంలో మాచర్ల మండలం చింతల తండా లో పోలీసులు బుధవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. నెల్లూరు ట్రాఫిక్ డిఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 40 మంది పోలీస్ సిబ్బందితో గ్రామంలో తనిఖీలు చేపట్టారు. అనుమానిత ప్రదేశాలను గుర్తించి క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం డిఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో శాంతిభద్రతలను పరిరక్షిస్తూ ప్రశాంతత నెలకొల్పడమే ధ్యేయమన్నారు. ఎవరైనా గొడవలు,అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.గ్రామాల్లో ఏదైనా సమస్య వస్తే పోలీసులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో నెల్లూరు ఎస్సి, ఎస్టీ సెల్ సిఐ ఆర్.సురేష్, ఆర్ఐ నాగ రాజు, విజయపురిసౌత్ ఎస్ఐ పట్టాభి రామయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి - దుర్గి

మండల కేంద్రమైన కోలగట్ల గ్రామం,లక్ష్మీపురం తండా లో దుర్గి ఎస్సై కోటయతో పాటు కేంద్రబలగాలు సిఆర్ పిఎఫ్ 40 మంది, ఎపిఎస్‌పి 10 మంది, అడిషనల్ ఎస్పీ ఒకరు, సిఐలు ఇద్దరు, ముగ్గురు ఎస్ఐల ఆధ్వర్యంలో సుమారు 65 మంది పోలీ సులు ఉద యం 6 గంటల నుంచి గ్రామంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ప్రధాన వీధుల్లో ప్రదర్శన నిర్వహించి, గ్రామంలోని గృహాల్లో, పశువుల పాకల్లోని దిబ్బలలో, వరిగడ్డి వాములలో క్షుణ్ణంగా పరిశీలించారు ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ధ్రువీకరణపత్రాలు లేని బైక్ లను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు సంబంధిత బైక్ యజమానులు బైక్ లకు సంబంధించి సరియైన పత్రాలు తీసుకు వస్తే వాటిని అప్పగిస్తామని పోలీసులు చెప్పారు. సాయంత్రం దుర్గి,అడిగొప్పుల, ఆత్మ కూర్‌లో ఫ్లాగ్ మార్చ్ నిర్వ హించారు.

ప్రజాశక్తి-మాచర్ల

ఎన్నికల సంద ర్భంగా నియోజక వర్గంలో జరిగిన ఘర్షణల నేప థ్యంలో పెద్దఎత్తున పోలీస్ బలగాలు పోలింగ్ పూర్త యిన నాటి నుండి పట్ట ణంలో బందో బస్తు నిర్వ హిస్తున్నారు. పోలీసు బలగాలు పెద్దఎత్తున ఉన్నప్పటికి చెదురు మదురు సంఘటనలు జరగు తుండటంతో, జూన్ 4న జరిగే ఎన్నికల కౌం టింగ్ దృష్ట్యా బందోబస్తును మరింత పటిష్టం చేస్తు న్నట్లు అధికారులు చెబు తున్నారు. రాష్ట్ర పోలీసు బలగాలతో పాటు, ప్రత్యేక పోలీసు బలగాలు, కేంద్ర పోలీసు బల గాలు కూడ మాచర్ల ప్రాంతంపై నిఘా పెట్టాయి. ఈ నేపథ్యంలో ప్రజలకు భరోసా కల్పించేందుకు పట్టణంలోని వీధులలో పోలీసు బలగాలు కవాత్ నిర్వహించాయి.





మాచర్ల మండలం చింతల తండాలో..



లక్ష్మీపురం తండాలో..



మాచర్లలో..



విద్యాభివృద్ధికి 'పిఎం-శ్రీ' నిధులు

ప్రజాశక్తి-ఈపూరు

కేంద్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి కృషి చేస్తుందని దానిలో భాగంగానే పిఎం-శ్రీ పథకం నిధులు రూ. 20 లక్షలు ఈపూరు జడ్పిహెచ్ఎస్‌కు మంజూరు చేసిందని పల్నాడు జిల్లా డీఈవో ఎం.వెంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రమైన ఈపూరు జడ్పిహెచ్ఎస్ లో కెమిస్ట్రీ ల్యాబ్ భవన నిర్మాణ పనులను బుధవారం ఆయన ఏఈ కె విశ్వనాథన్ తో కలిసి పరిశీలించారు. అనంతరం శ్లాబ్ పనులను డీఈఓ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని రకాల సదుపాయాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రధానో పాధ్యాయులు ఎన్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ కెమిస్ట్రీ ల్యాబ్ నిర్మాణానికి రూ. 15 లక్షలు, ఆట స్థలం అభివృద్ధికి ఐదు లక్షలు పిఎంశ్రీ నిధులు మంజూరయ్యాయని, పనులను వేగ వంతంగా చేపడు తున్నట్లు చెప్పారు. విద్యార్థులలో క్రీడా సామర్థ్యాలను పెంపొందించడానికి ఆట స్థలం దోహదం చేస్తుందని క్రీడాకారులను ఉత్సాహపరిచేలా ఆట స్థలాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. అలాగే , విద్యార్థులలో పరిశోధనాత్మక నైపుణ్యాలను పెంపొందించేలా కెమిస్ట్రీ ల్యాబ్ నిర్మాణం జరుగుతుందని అన్ని రకాల విద్యా వసతులు విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు ఎ. వీరాంజనేయులు పాల్గొన్నారు.



శ్లాబ్ పనులు ప్రారంభిస్తున్న డీఈవో ఎం.వెంకటేశ్వర్లు

పచ్చి రొట్ట ఎరువులు పంపిణీ

ప్రజాశక్తి-అచ్చంపేట

50 శాతం రాయితీతో పచ్చి రొట్టె ఎరువులు అచ్చంపేట మండలంలోని రైతు భరోసా కేంద్రాలలో సబ్సిడీపై పచ్చిరొట్ట ఎరువులు జీలుగులు,జనుము, పిల్లి పెసర విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు అచ్చంపేట వ్యవసాయ అధికారి పి.వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. జీలుగులు ఎకరానికి 10 కేజీలు పూర్తి ఖరీదు రూ.880, రాయితీపై రూ.440, జనుము ఎకరానికి 10 కేజీలు. పూర్తి ఖరీదు రూ.880 కాగా రాయితీపై రూ.440, పిల్లి పెసర ఎకరానికి 8 కేజీలు పూర్తి ఖరీదు రూ.1072 అని, రాయితీపై రూ.536, చెల్లించాలని వివరించారు. పచ్చిరొట్ట ఎరు వులు కావలసిన రైతులు ఆధార్ కార్డు, పట్టదార్ పాస్ పుస్తకం నకలు, ఫోను తీసుకొని సంబధిత రైతు భరోసా కేంద్రంలో సం ప్రదించాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఓట్ల లెక్కింపునకు ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు : గుంటూరు జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సజావుగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం పూర్తి స్థాయిలో పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీష్ వ్యాస్‌కు తెలిపారు. బుధవారం న్యూఢిల్లీ నిర్వచన్ సదన్ నుండి సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీష్ వ్యాస్ జూన్ 4న జరిగే ఓట్ల లెక్కింపుపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషనర్, జిల్లా ఎన్నికల అధికారులు, కలెక్టర్లు, ఎస్పీలు, రిటర్నింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుండి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, ఎస్పీ తూషార్ దూడి తదితరులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ సీసీ కెమెరాలు, ఇంటర్నెంట్ సౌకర్యం, బారికేడింగ్, కంప్యూటర్లు, ఇతర మెటీరియల్స్ కౌంటింగ్ హల్స్‌లో ఏర్పాటు చేశామన్నారు. కౌంటింగ్ సిబ్బందికి తొలి విడత శిక్షణ పూర్తి అయ్యిందన్నారు. ఓట్లు లెక్కింపునకు సంబంధించి తాడికొండ అసెంబ్లీ నియోజకవర్గానికి తక్కువుగా 18 రౌండ్లు, మంగళగిరి నియోజకవర్గానికి ఎక్కువుగా 22 రౌండ్లు ఓట్లు లెక్కింపు ఉంటుందన్నారు. మంగళగిరి ఓట్ల లెక్కింపు సాయంత్రం 5.30 గంటలకు పూర్తి అయ్యే అవకాశం ఉందన్నారు. మిగతా నియోజకవర్గాలు సాయంత్రం 3.30 నుంచి సాయంత్రం 5.00 గంటలలోపు పూర్తి అయ్యే అవకాశం ఉందన్నారు. కంట్రోల్ యూనిట్‌లో ప్రతి అభ్యర్థి ఫలితాల ప్రదర్శనకు సూమారు 8 సెకన్ల సమయం ఉంటుందని, పోటీలో ఉన్న అభ్యర్థులందరి ఫలితాలు ప్రదర్శనకు దాదాపు 6 నుంచి 7 నిమిషాలు సమయం పడుతుందని, దీని ప్రకారం ప్రతి రౌండ్ కు 20 నుంచి 25 నిమిషాలు సమయం పట్టే అవకాశం ఉందన్నారు. మొదటి రెండు రౌండ్ల వరకు 30 నుంచి 35 నిమిషాలు సమయం పట్టే అవకాశం ఉందని, మిగతా రౌండ్లకు 25 నిమిషాలు వరకు సమయం పట్టే అవకాశం ఉందని అంచనా వేయటం జరుగుతుందన్నారు. దీని ప్రకారం సాయంత్రం 5.30 గంటలకు ఓట్లు లెక్కింపు మొత్తం ప్రక్రియ పూర్తి అయ్యే అవకాశం ఉందని సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీష్ వ్యాస్ కు జిల్లా కలెక్టర్ వివరించారు.జిల్లా ఎస్పీ తూషార్ దూడి భద్రత, శాంతి భద్రతలతకు సంబంధించిన అంశాలను సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీష్ వ్యాస్‌కు వివరిస్తూ కౌంటింగ్ కేంద్రంలో, పరిసర ప్రాంతాల్లో పూర్తి స్థాయిలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. సీసీకెమారాలు, బాడీవేర్ కెమారాలు, డ్రోన్లతో నిరంతరం పర్యవేక్షణ చేయటం జరుగుతుందన్నారు. శాంతి భద్రతలకు సంబంధించి జిల్లాలో రాజకీయ పరిస్థితులు, రాజకీయపార్టీల రాష్ట్ర కార్యాలయాలు, ముఖ్యనేతల నివాసాలు తదితర అంశాల ఆధారంగా 185 సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించటం జరిగిందన్నారు. జిల్లాలో 150 పికెటింగ్ పాయింట్లు, 75 మొబైల్ పార్టీలు, 28 క్యూఆర్టీ పార్టీలు, 8 స్ట్రైకింగ్ ఫోర్స్ లను ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. జిల్లాలో ప్రదాన పార్టీల రాష్ట్ర కార్యాలయాలు ఉన్నాయని వాటి వద్ద అవసరం మేరకు బందోబస్తు ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. జిల్లాలో ఓట్లు లెక్కింపు సందర్భంగా ఎటువంటి అనివార్య సంఘటనలు జరగకుండా పూర్తి స్థాయిలో బందోబస్తు ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. సమావేశంలో మంగళగిరి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జేసీ రాజకుమారి, గుంటూరు తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, నగర కమిషనర్ కీర్తి చేకూరి, పొన్నూరు అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి లక్ష్మీ కుమారి, డిఆర్ఒ పెద్ది రోజా, ఇతర అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇతర అధికారులు



పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొన్న లిఫ్టర్లు

పవర్ లిఫ్టింగ్, బెంచ్ ప్రెస్ రాష్ట్రస్థాయి పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పట్టణంలోని ఈద్గా షాదిఖాన నందు ఆంధ్రప్రదేశ్ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో 11వ ఆంధ్రరాష్ట్ర సబ్-జూనియర్, జూనియర్, సీనియర్, మాష్టర్స్ పవర్ లిఫ్టింగ్ మరియు బెంచ్ ప్రెస్ చాంపియన్ షిప్-2024 పోటీలను బుధవారం రాత్రి ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ పోటీలు మూడు రోజులపాటు జరుగుతాయి. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి అంతర్జాతీయ పవర్ లిఫ్టర్ షేక్ సంధాని అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు మాట్లాడుతూ పవర్ లిఫ్టర్లు క్రీడారంగంలో రాణించి ఖ్యాతి తీసుకురావాలని అన్నారు. ఎంటిఎంసి ప్రెసిడెంట్ దొంతిరెడ్డి వేమారెడ్డి, ఎమ్మెస్సార్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ కార్యదర్శి బసవపున్న రెడ్డి, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, పద్మశాలియ కార్పొరేషన్ డైరెక్టర్ పారేపల్లి విజయలక్ష్మి, ఆంధ్రప్రదేశ్ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మద్ది ప్రభాకర్, పలు రాష్ట్రాల పురుషులు మరియు మహిళా క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

ఏపీ రాజధాని ఖరారయ్యే వరకూ

ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్‌ను కొనసాగించాలి

ప్రజాశక్తి-గుంటూరు

ఆంధ్రప్రదేశ్ రాజధాని నగరం ఖరారు అయ్యే వరకూ ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్ కొనసాగించేలా కేంద్రంపై పార్టీలు, ప్రజాసంఘాలు ఒత్తిడి చేయాల్సిన అవసరం ఉందని అవగాహన సభ్యులు అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన కార్యాలయంలో 'రాజధాని లేని రాష్ట్రం ఆంధ్రప్రదేశ్' అనే అంశంపై అవగాహన సభ్యులు చర్చించారు. ఈ సందర్భంగా యోగాచార్యులు అచ్యుత ఇందుశేఖర్ మాట్లాడుతూ విభజన చట్టం ప్రకారం హైదరాబాద్ ఇప్పటి వరకూ ఎపి, తెలంగాణకు ఉమ్మడి రాజధానిగా ఉందని, ఈ గడువు జూన్ 2వ తేదీతో ముగుస్తుందన్నారు. అయితే ఉమ్మడి రాజధానిపై ప్రధాన పార్టీలు పట్టించుకోట్లేదన్నారు. కొత్త రాజధాని నిర్మాణం పూర్తి అయ్యే వరకూ హైదరాబాద్‌ను ఉమ్మడి రాజధానిగా పొడిగించాల్సిన అవసరం ఉందని మేధావులు, ప్రజాసంఘాలు మాత్రం డిమాండ్ చేస్తున్నారన్నారు. ఏపి రాజధానిపై రాబోయే కొత్త ప్రభుత్వమైనా తీసుకోవాలని కోరారు. విద్యావేత్త ఎస్.రవిబాబు, నారపరెడ్డి తదితరులు ప్రసంగించారు.



మాట్లాడుతున్న ఇందుశేఖర్

నిడమర్రులో ఎస్ఆర్ఎం ఉచిత ట్యూషన్ సెంటర్ ప్రారంభం


ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మంగళగిరి మండలం నిడమర్రు గ్రామంలో బుధవారం ఉదయం ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఉచిత ట్యూషన్ సెంటర్ ప్రారంభమైంది. ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్ ప్రేమ్ కుమార్, స్టూడెంట్ అఫైర్స్ డిపార్ట్మెంట్ అసోసియేట్ డైరెక్టర్ రేవతి బాలక్రిష్ణన్ సంయుక్తంగా సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్ ప్రేమ్ కుమార్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఉద్దేశించి ప్రసంగించారు. బోధన, పరిశోధనల్లో అగ్రగామి విద్యానిలయంగా అంతర్జాతీయ స్థాయిలో పేరు గడించిన ఎస్ఆర్ఎం యూనివర్సిటీకి చెందిన ఎస్ఆర్ఎం ఫౌండేషన్ (చెన్నై) తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగిస్తోందన్నారు. ఎంపిక చేసిన గ్రామాల్లో ఉచిత విద్య, మహిళాభివృద్ధి, రోడ్డుభద్రత, మహిళా వికాసం కోసం ప్రత్యేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోందని వివరించారు. ఇందులో భాగంగా మంగళగిరి మండలం నిడమర్రు గ్రామంలో ఉచిత ట్యూషన్ సెంటర్‌ను ప్రారంభించడం జరిగిందన్నారు. గ్రామీణ ప్రాంతంలో నివసించే విద్యార్థులకు ఉచితంగా విద్యను అందించే లక్ష్యంతో మొట్టమొదటి గ్రామీణ ట్యూషన్ సెంటర్ ఏర్పాటు చేయడం జరిగిందని ఫౌండేషన్ ప్రతినిధి సురేశ్ కన్నన్ పేర్కొన్నారు. తమిళనాడు రాష్ట్రంలో ఇప్పటి వరకూ 22 ట్యూషన్ సెంటర్లను నెలకొల్పి 570 మంది విద్యార్థులకు పాఠ్యాంశాల బోధన జరుగుతుందని యూనివర్సిటీ మీడియా పబ్లిక్ రిలేషన్స్ మేనేజర్ వేణుగోపాల్ గంగిశెట్టి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్లో ఏర్పాటు చేసిన మొట్ట మొదటి ఉచిత ట్యూషన్ సెంటర్ ఇదేనన్నారు. అరవ తరగతి నుంచి పదవ తరగతి చదివే పేద విద్యార్థులకు ఇక్కడ ఉచితంగా పాఠ్యాంశాలను బోధించడం జరుగుతుందని 'పుతియ తలై మురై ఫౌండేషన్' సీనియర్ కన్సల్టెంట్ ఎలమరన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు చిన్నారులు భవిష్యత్తులో తాము డాక్టర్లు, ఇంజినీర్లుగా ఎదుగుతామని పేర్కొన్నారు. నిడమర్రులో తొలి ట్యూషన్ సెంటర్‌ను ఏర్పాటు చేయడమే కాకుండా తనకు బోధించే అవకాశం కల్పించిన ఎస్ఆర్ఎం ఫౌండేషన్‌కు ట్యూషన్ సెంటర్ ఉపాధ్యాయురాలు ప్రత్తిపాటి సుష్మ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు, నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో యూనివర్సిటీ ఛీఫ్ లయజన్ ఆఫీసర్ పూళ్ల రమేష్ కుమార్, అసిస్టెంట్ మేనేజర్ రామచంద్రారెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.


ట్యూషన్ సెంటర్ ప్రారంభిస్తున్న రిజిస్ట్రార్ డాక్టర్ ప్రేమ్‌కుమార్



విద్యార్థులకు బుక్స్ పంపిణీ చేస్తున్న ఎస్ఆర్ఎం ఫౌండేషన్ ప్రతినిధులు


ట్యూషన్ సెంటర్‌కు హాజరైన విద్యార్థులు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-తాడేపల్లి : విద్యుత్ లైన్ల అత్యవసర మరమ్మతుల నిమిత్తం గురువారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఉండవల్లి సెంటర్, ఉండవల్లి గుహలు, హరిజనవాడ, కుమ్మరికుంట, కోస్టల్ బ్యాంకు ఏరియా, అమరారెడ్డినగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డిఇ సత్యనారాయణ, ఎఇ షణ్ముకరావు ఓ ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

మూడ్రోజులపాటు కొలనుకొండ రైల్వే గేటు మూసివేత

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

పెదవడ్లపూడి-కృష్ణా కెనాల్ జంక్షన్ మధ్య ఉన్న కొలను కొండ రైల్వే ట్రాక్ పనుల నిమిత్తం మే 31 ఉదయం 7 గంటల నుండి జూన్ 2 సాయంత్రం 5 గంటల వరకు కొలనుకొండ రైల్వే గేట్ మూసివేస్తున్నట్లు బుధవారం రైల్వే అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. కొలనుకొండ రైల్వే ట్రాక్ వైపు నుండి ప్రయాణం సాగించే వాహనదారులు, ప్రయాణికులు పై విషయాన్ని గమనించాలని సౌత్ సెంట్రల్ రైల్వే విజయవాడ డివిజన్ అధికారులు కోరారు. తాడేపల్లి మండల తాసిల్దార్ కు సూచనలను చేస్తూ ఈ మూడు రోజులపాటు ప్రత్యామ్నాయ మార్గం ప్రయాణికులకు తెలపాలని అధికారులు కోరారు.



లైబ్రరీలో కొనసాగుతున్న వేసవి శిబిరం

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయంలో మే 15 నుండి జూన్ 7వ తేదీ వరకూ నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా బుధవారం ఇంగ్లీషు అధ్యాపకులు వ్యాకరణం బోధించటంలో భాగంగా ఆర్టికల్స్, టెన్సెస్ గురించి పిల్లలకు అర్థమయ్యే రీతిలో తెలియజేశారు. తర్వాత పిల్లలకు గణితం పాఠాలు చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రంధాలయాధికారి ఎన్.వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.



శాఖా గ్రంథాలయం సందర్శన

ప్రజాశక్తి-తాడేపల్లి : తాడేపల్లి పట్టణంలోని శాఖా గ్రంథాలయాన్ని బుధవారం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వి.సుబ్బరత్నం సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. గ్రంథాలయ పనితీరు గురించి హర్షం వ్యక్తం చేశారు. సమ్మర్ క్యాంప్‌తో పాటు మరింత మంది పాఠకులు గ్రంథాలయానికి వచ్చే విధంగా పలు సూచనలు చేశారు. విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పలు ఇంగ్లీషు మ్యాగ్జిన్‌లు అందుబాటులో ఉంచాలన్నారు. గ్రంథాలయ అధికారి నాగూర్‌బాష ఆమెకు సహకరించారు.

పోస్టాఫీసు మార్పు

ప్రజాశక్తి-తాడేపల్లి : ఇప్పటివరకు తాడేపల్లి ప్యారీ కంపెనీ గేటు సమీపంలో పట్టణ ప్రజలకు సేవలందిస్తున్న తాడేపల్లి పోస్టాఫీసు జూన్ రెండో తేదీ నుంచి ముగ్గురోడ్డు సెంటర్ వద్ద గల పాత విలేజ్ సెంటర్ ఆసుపత్రి వద్దకు మార్చినట్లు పోస్ట్‌మాస్టర్ ఓ ప్రకటనలో తెలిపారు. కొత్త కార్యాలయం నుంచి ప్రజలు పోస్టాఫీసు సేవలు అందు కోవచ్చని చెప్పారు.

నిత్య అన్నదాన పథకానికి విరాళం

ప్రజాశక్తి - తెనాలి : పెదకాకాని దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో నిత్య అన్నదానం నిమిత్తం స్థానిక మల్లేశ్వర స్వామి సేవా సమితి అధ్యక్షులు బోయపాటి వెంకటరమణ తన పుట్టినరోజు సందర్భంగా బుధవారం రూ. 27వేలు విరాళం అందించినట్లు దేవస్థాన ఉప కమిషనర్, కార్యనిర్వహణాధికారి వి.వి.యస్.కె. ప్రసాద్ తెలిపారు.

పేటలో బస చేసిన పిన్నెల్లి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పలు కేసుల్లో నిందితుడుగా ఉండి హైకోర్టు నుంచి బెయిల్ పొందిన మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి బుధవారం నరసరావుపేటలో బస చేశారు. సాయంత్రం ఆయన జిల్లా ఎస్పి కార్యాలయానికి వెళ్లి సంతకం చేశారు. అనంతరం వైసిపి నరసరావుపేట లోక్‌సభ అభ్యర్థి పి.అనిల్‌కుమార్ నివాసంలో ఆయన బస చేశారు. వచ్చేనెల 5 వరకు నర్సరావుపేటలో ఉండాలని హైకోర్టు ఉత్తర్వుల మేరకు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మంగళవారం రాత్రి 12 ప్రాంతంలో ఎస్పి కార్యాలయంలో సంతకం చేసి వెళ్లారు. బుధవారం సాయంత్రం 5.40 గంటల ప్రాంతంలో ఎస్పి కార్యాలయానికి వచ్చి సంతకం చేశారు.



మీడియాతో మాట్లాడుతున్న జిల్లా పోలీస్ ఫిర్యాదుల ప్రాధికారి సంస్థ గుంటూరు, చైర్మన్ రిటైర్డ్ జడ్జి నిరంజన్

పోలీసులపై విచారణ చేస్తాం

జిల్లా పోలీస్ ఫిర్యాదుల ప్రాధికార సంస్థ చైర్మన్ నిరంజన్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పోలీస్ శాఖలోని కానిస్టేబుల్ స్థాయి నుండి డిప్యూటీ సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ స్థాయి అధికారి వరకు వచ్చే ఫిర్యాదులపై విచారణ చేపడుతుందని జిల్లా పోలీస్ ఫిర్యాదుల ప్రాధికారి సంస్థ గుంటూరు, చైర్మన్ రిటైర్డ్ జడ్జి నిరంజన్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ డిస్టిక్ పోలీస్ కంప్లైంట్స్ అథారిటీస్ అథారిటీ ప్రాంతీయ కార్యాలయం కాజ గ్రామంలో ఏర్పాటు చేసినట్టు ఆయన వివరించారు. గుంటూరు, పల్నాడు బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాల అధికార పరిధిగా కాజా గ్రామంలోని లాస్య రెసిడెన్సిలో కార్యాలయం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. పోలీస్ శాఖలో కానిస్టేబుల్ నుండి, డిఎస్పి స్థాయి వరకు వచ్చే ఫిర్యాదులను తమ సంస్థ విచారిస్తుందని తెలిపారు. .ముఖ్యంగా పోలీస్ కస్టడీలో జరిగే మరణాలు, అత్యాచారాలు అదేవిధంగా పోలీస్ కస్టడీలో తీవ్రమైన గాయాలు, పోలీసులచే బలవంతపు వసూళ్లు, పోలీసులచే ఇండ్లు భూ ఆక్రమణలు, పోలీస్ అధికారులు వారి అధికారాన్ని దుర్వినియోగం పరచటం లాంటి పై ప్రాధికార సంస్థ విచారణ చేపడుతుందన్నారు. ఇది ఇలా ఉండగా అస్పష్టమైన ఆకాశరామన్న ఫిర్యాదులు మారుపేరుతో కూడిన వీలులేని చేతి వ్రాత అస్పష్టమైన ఫిర్యాదులు, సంఘటన జరిగి ఒక సంవత్సరం కాలం ముగిసిన తర్వాత నియమాలు కార్మికుల లేదా పారిశ్రామిక వివాదాలు పై ఫిర్యాదులు స్వీకరించడం జరగదని నిరంజన్ తెలిపారు. సంస్థ సభ్యులు అడిషనల్ ఎస్పీ (రిటైర్డ్) కే రఘు, సి ఆర్ డి ఏ డిప్యూటీ డైరెక్టర్ (రిటైర్డ్) చెన్నకేశవులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శ్రీకేశ్ లత్కర్ బాలజీరావు, పక్కన జాయింట్ కలెక్టర్ ఏ.శ్యాం ప్రసాద్, శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న సిబ్బంది

కౌంటింగ్ ప్రక్రియలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

పల్నాడు జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి లత్కర్ బాలాజీరావు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

వచ్చే నెల 4 వ తేదీన నరసరావుపేట మండలంలోని కాకాని వద్ద గల జె.ఎన్.టి.యు కళాశాలలో నిర్వహించనున్న కౌంటింగ్ ప్రక్రియ పారదర్శకంగా, పకడ్బందీగా, అప్రమత్తతో మరియు వేగంగా చేసేలా పోలింగ్ సిబ్బంది పని చేయాలని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి శ్రీకేశ్ అన్నారు. బుధవారం స్థానిక నరసరావుపేటలోని ఎ-1 కన్వెన్షన్ సెంటర్లో రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ అధికారులు పోలింగ్ సిబ్బందికి కౌంటింగ్ ప్రక్రియపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమములో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని ప్రసంగించారు. పోలింగ్ సమయంలో, రిసెప్షన్ సెంటర్ మరియు కౌంటింగ్ సెంటర్ లో ఏమైనా తప్పిదాలకు పాల్పడిన సిబ్బందిపై కఠిన చర్యలు తెసుకోవడం జరుగుతుందన్నారు. కౌంటింగ్ సిబ్బందికి ఏమైనా సమస్యలు ఉంటె సంబంధిత రిటర్నింగ్ అధికారి దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కరించుకోవాలన్నారు. ఎటువంటి సంఘటనలు జరుగకుండా ఫలితాలు సజావుగా వచ్చేలా శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా చూడాలన్నారు. సిబ్బంది ఎక్కడ కూడా సొంత నిర్ణయాలు, ఆలోచనలు, ప్రయోగాలు చేయ రాదని, ఎన్నికల నియమావళి తప్పక పాటించాలన్నారు. శిక్షణా తరగతులకు హాజరుకాని సిబ్బందిపై చర్యలు తీసుకోవడం, ఆయా శాఖల జిల్లా అధికారులకు షోకాజు నోటీసులు జారీచేయడం జరుగుతుందన్నారు. కౌంటింగ్ సిబ్బంది సంబంధిత రిటర్నింగ్ అధికారి అనుమతి లేకుండా బయటకు వెళ్లకూడదన్నారు. ఏజంట్లతో సమన్వయంతో, సహననంతో పని చేయాలని సూచించారు. ఎన్నికల శిక్షణ నోడల్ అధికారి శ్రీదేవి కౌంటింగ్ ప్రక్రియపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనర్ అరుణ కుమార్ పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియపై వివరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాం ప్రసాద్ పాల్గొన్నారు.

పల్నాడు జిల్లా కౌంటింగ్ సెంటర్‌లో మొత్తం 15 కౌంటింగ్ హాల్స్‌లో కౌంటింగ్ ప్రక్రియ జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. అందులో 7 కౌంటింగ్ సెంటర్లు అసెంబ్లీ నియోజిక వర్గాలకు 14 ఈవిఎం టేబుళ్లు 2 పోస్టల్ బ్యాలెట్ టేబుళ్లు ఉంటాయని, మాచర్ల, సత్తెనపల్లి నియోజక వర్గానికి 3 పోస్టల్ బ్యాలెట్ టేబుళ్ళు ఉంటాయన్నారు. పార్లమెంట్ నియోజకవర్గానికి 7 హాల్స్‌కు సంబంధించి 14 ఈవిఎం టేబుళ్లు, 18 పోస్టల్ బ్యాలెట్ టేబుళ్ళకు సంబంధించి వేరొక కౌంటింగ్ సెంటర్ ఏర్పాటు చేశామన్నారు.

మైక్రో అబ్జర్వర్లతో కలెక్టర్ సమావేశం

ఎన్నికల ప్రక్రియలో ఖచ్చితత్వంతో పాటు వేగం ముఖ్యమని ,కౌంటింగ్ ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి శ్రేకేశ్ బి లాత్కర్ బాలజీరావు అన్నారు. పల్నాడు జిల్లా నరసరావుపేట కలెక్టరేట్‌లో కౌటింగ్ ప్రక్రియలో సూక్ష్మ పరిశీలకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మైక్రో అబ్జర్వర్లు కౌంటింగ్ ప్రక్రియను నిశితంగా పరిశీలిస్తూ ఉండాలన్నారు. పల్నాడు జిల్లాలో పోలింగ్ సమయంలో జరిగిన కొన్ని సంఘటనల దృష్ట్యా ఈసి పల్నాడు ప్రాంతంపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. కౌటింగ్ ప్రక్రియ విమర్శలకు, సందేహాలకు తావు లేకుండా అందరు కలసి పని చేయవలసిన అవసరం ఉందన్నారు. కౌంటింగ్ సూపర్వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్ లు, ఏజంట్లు ఎవరైనా సమస్యలు తెసుకొని వస్తే మైక్రో అబ్జర్వర్లు ఎన్నికల పరిశీలకుల దృష్టికి తీసుకు వెళ్లాలని సూచించారు. మైక్రో అబ్జర్వర్లు పోస్టల్ బ్యాలట్ ప్రక్రియలో అనుమతించేవి, అనుమతించనివి జాగ్రత్తగా పరిశీలించాలని సూచించారు. ఈవిఎం లు కౌంటింగ్ ఏజెంట్లకు చూపించి పద్ధతి ప్రకారం అనుమానాలకు తావు లేకుండా చూడాలన్నారు. మైక్రో అబ్జర్వర్లు సి.యులను కౌంటింగ్ ఏజంట్లకు కనపడే విధముగా చర్యలు తీసుకోవాలన్నారు. మైక్రో అబ్జర్వర్లు మరియు కౌంటింగ్ సూపర్వైజర్లు ఇచ్చే షీట్లలో తేడా ఉండకుండా మైక్రో అబ్జర్వర్లు చూడాలన్నారు. ఇతర జిల్లాలతో పోల్చు కుంటే పల్నాడు జిల్లా మీద ప్రత్యేక దష్టి ఉందన్నారు. కౌంటింగ్ రోజు తదుపరి రోజు ఎటువంటి అవాంచనీయ ఘటనలు జరుగకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమములో జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం తదితరులు పాల్గొన్నారు.

హాజరు, ఫొటోల కోసం గంటల తరబడి నడక, నిరీక్షణ

సిపిఎం, వ్యకాస నాయకుల ఎదుట ఆవేదన వ్యక్తం చేసిన ఉపాధి హామీ కూలీలు

కూలీలకు సౌకర్యాలు కల్పించి, సమస్యలు పరిష్కరించాలని నాయకుల డిమాండ్


నంబూరులో ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతున్న పాశం రామారావు

ప్రజాశక్తి - పెదకాకాని

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు కోరారు. పెదకాకాని మండలంలోని నంబూరు, గోళ్లమూడు గ్రామాల్లో ఉపాధి హామీ పని ప్రదేశాలను బుధవారం సందర్శించి కూలీలతో మాట్లాడారు. ఈ సందర్భంగా కూలీలు తమ వేదనను నాయకులకు తెలిపారు. హాజరు, ఫొటోల కోసం పని అనంతరం గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోందని, ఇందుకోసం రెండు కిలోమీటర్ల దూరం వెళ్లి రావాల్సి వస్తోందని ఆవేదన వెలిబుచ్చారు. పని ప్రదేశంలోనే ఫొటోలు, హాజరు నమోదు చేయాలన్నారు. అనంతరం సిపిఎం మండల కార్యదర్శి ఎన్.శివాజి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రామారావు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ చట్టానికి బడ్జెట్‌లో నిధులను భారీగా కోత విధించిందని, చట్టాన్ని నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. వ్యవసాయ పనుల్లేని రోజుల్లో పేదలకు పనులు కల్పిస్తూ కడుపు నింపే చట్టాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేయించుకోవాల్సిన అవసరం ఉందని, ఇందుకోసం కూలీలంతా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రతికుటుంబానికి కనీసం 100 పనిదినాల కల్పనతోపాటు వేసవి ఎండల తీవ్రత నేపథ్యంలో కూలీలకు సమ్మర్ అలవెన్స్ ఇవ్వాలని, ఒక్కో కూలీకి రూ.2 చొప్పున మేట్‌లకు అదనంగా చెల్లించాలని కోరారు. పని ప్రదేశంలో కూలీలకు హాజరు నిరీక్షించే అవసరం లేకుండా నమోదు చేయాలన్నారు. శివాజి మాట్లాడుతూ పనులను రెండు పూటలా చేయాలనే నిబంధనను ఎత్తేయాలన్నారు. కూలీలకు తాగునీరు, మజ్జిగ, మెడికల్ కిట్‌లు అందుబాటులో ఉంచాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు జి.రాజా రమేష్, ఎం.శ్రీనివాసరావు, వెంకటరెడ్డి, సింహాద్రి పాల్గొన్నారు.


జొన్నలగడ్డలో ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతున్న ఈమని అప్పారావు

ప్రజాశక్తి-గుంటూరు

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కింద పనిచేస్తున్న కూలీలకు ప్రభుత్వం నిర్ణయించిన రూ.300ల కనీస వేతనం అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు డిమాండ్ చేశారు. బుధవారం గుంటూరు రూరల్ మండలంలోని జొన్నలగడ్డలో ఉపాధి పనులను పరిశీలించి ఉపాధి కూలీలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధిహామీ కూలీలు అనేక సమస్యలను నాయకుల దష్టికి తీసుకువచ్చారు. పనిచేయడానికి గ్రామం నుండి సుమారు ఐదు కిలోమీటర్లకుపైగా నడిచి వెళుతున్నామని, వడగాల్పులు విపరీతంగా వీస్తున్నాయన్నారు. ఈ పరిస్థితులలో ప్రభుత్వం ఇచ్చే మంచినీళ్ల కూడా ఈసంవత్సరం ఇవ్వకుండా ఆపివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి హామీలో మౌలిక వసతులు లేవని తెలిపారు. ఈ సందర్భంగా ఈమని అప్పారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని ఎత్తివేయాలని కుట్రపూరితంగా వ్యవహరిస్తుందన్నారు. వ్యవసాయ కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు, వామపక్ష పార్టీలు అనేక పోరాటాలు చేసిన ఫలితంగా ఈచట్టం వచ్చిందని, పని హక్కుని గ్యారెంటీ చేస్తూ వచ్చిన ఈచట్టం కూలీలకు ఎంతో ఉపయోగకరంగా ఉందని తెలిపారు. పనిలేని రోజుల్లో సుదూర ప్రాంతాలకు వలస పోకుండా ఉన్న గ్రామంలోనే పని కల్పించాల్సిన బాధ్యత ఈచట్టం ద్వారా ప్రభుత్వానికి ఉందని తెలిపారు. ఇంత ఉపయోగకరంగా ఉన్న ఈ చట్టాన్ని నిర్వీర్యం చేయటానికి బడ్జెట్లో రోజురోజుకు నిధులు తగ్గిస్తున్నారని విమర్శించారు. గతంలో ఇచ్చిన సదుపాయాలను కూడా తీసివేసి కేవలం పనిచేసిన దానికి మాత్రమే వేతనం చెల్లిస్తున్నారని ఇది సరైంది కాదని అన్నారు. పలుగు సాన పెట్టడానికి వంద రూపాయలకు పైన ఖర్చు అవుతుందని రోజు పనికి రూ.200 నుండి రూ.250లు మాత్రమే కూలి పడుతుందని, వీటిల్లో సాన పెట్టడానికి వంద రూపాయలు పోతే మిగతాది కుటుంబ ఖర్చు ఎలా సరిపోతాయని ప్రశ్నించారు. అలాగే రెండు పూటలా పని పెట్టడం వల్ల కూలీలకు ఉపాధి పని పట్ల విసుగు చెంది తమంతట తామే మానివేసే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తుందని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమ్మర్ అలవెన్స్, మంచినీటికి డబ్బులు, పలుగు, పారకు ఇచ్చే డబ్బులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఇమిడి రామారావు తదితరులు పాల్గొన్నారు .